జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 60 | హైదరాబాద్, డిసెంబర్ 19 శనివారం 2020 | 8 పేజీలు | వెల : 5.00

## మీ మేలు కోరేవాడినే..
# చట్టాలపై నమ్మకం ఉంచండి:మోదీ



న్యూఢిల్లీ,డిసెంబర్ 18, ప్రజాపాలన : కేంద్రం నూతనంగా తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలపై ప్రజలు, రైతులు నమ్మకం ఉంచాలని ప్రధాని నరేంద్ర మోదీ అభ్యర్థించారు. మంచి ఉద్దేశాలతోనే ఈ చట్టాలను తీసుకొచ్చామని, ఎలాంటి దురుద్దేశాలూ లేవని తేల్చి చెప్పారు. కనీస మద్దతు ధర కొనసాగు తుందని, దానికి ఎలాంటి ఆటంకమూ కలగదని పునరుద్ఘాటించారు. కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలపై మధ్యప్రదేశ్ రైతులతో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతనంగా తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను రాత్రికి రాత్రే తీసుకు రాలేదని, గత 20,30 సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలంకషంగా చర్చించా యని అన్నారు.దేశంలోని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, కాస్త ప్రోగ్రేసివ్ భావాలతో ఆలోచించే రైతులు ఈ వ్యవసాయ సంస్కరణలను కోరుకున్నారని మోదీ పేర్కొన్నారు. కొందరి రాజకీయ పునాదులు కూకటి వేళ్లతో సహా కదులుతున్నాయి కాబట్టే, నూతన చట్టాల పేరుతో రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. నూతన చట్టాలపై ఇప్పుడు లబోదిబోమంటూ కన్నీరు కారుస్తున్న వారు, ఎనిమిదేళ్లుగా స్వామినాథన్ రిపోర్టులను ఎందుకు తొక్కి పెట్టారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## వ్యవసాయేతర రిజిస్ట్రేషన్లపై నేడు
# కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్ష



హైదరాబాద్, డిసెంబర్ 18, ప్రజాపాలన :వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు శనివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రెవెన్యూ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి హైకోర్టు ఆదేశాల కాపీ ఇంకా ప్రభుత్వానికి అందలేదు. అందిన తర్వాత దానిపై కూలంకషంగా చర్చించి తగు నిర్ణయం తీసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. హైకోర్టు నిర్ణయంపై సుప్రీం కోర్టుకు వెళ్లడమా? లేదంటే తగు విధమైన విధివిధానాలు రూపొందించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను చేపట్టడమా ? అనే అంశంపై రెవెన్యూ, న్యాయ శాఖల నిపుణులతో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# సంజయ్ నీకిదే మొదటి.. చివరి పదవి:ఎర్రబెల్లి



వరంగల్,డిసెంబర్ 18, ప్రజాపాలన :బండి సంజయ్ కొత్త బిక్షగాడు. నాలుగుసార్లు ఓడారని జాలితో కనికరించి కరీంనగర్ ప్రజలు గెలిపించారు. సంజయ్.. ఇదే నీకు మొదటిది చివరి పదవి అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. గంగా జమున తహజిబ్‌గా ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో చిచ్చుపెట్టొద్దన్నారు. సీఎం కేసీఆర్‌ను జైల్లో పెట్టే దమ్ముందా నీకు ? తెలంగాణ ప్రజలు కొడితే నువ్వు మానేరు డ్యాములో పడతావు. దమ్ముంటే కేంద్రం నుంచి నీళ్ల వాటా తీసుకురా. మిషన్ భగీరథకు, మిషన్ కాకతీయకు నిధులు తెచ్చావా? కాళేశ్వరం ప్రాజెక్ట్ కు డబ్బులు తేచ్చావా? నువ్వు ఏమి చేశావో కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏమి తెచ్చావో చెప్పగలవా? లేదంటే నిన్ను కరీంనగర్ ప్రజలే ఉరికిచ్చి కొడతారు. కేవలం మీడియాలో హైప్ కోసం హైదరాబాద్ మీద, సీఎం కేసిఆర్ మీద మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ బలహీనపడటం వల్ల, మతతత్వం సెంటిమెంట్‌తో దేశంలో గెలిచారు. మిగతా 3లో..

# జనవరి నుంచి స్కూళ్లు, జూనియర్ కాలేజీలు ప్రారంభం..?



హైదరాబాద్, డిసెంబర్ 18, ప్రజాపాలన :తెలంగాణలో కరోనా కారణంగా మూతబడిన పాఠశాలలు ఇంకా తెరుచుకోలేదు. అయితే విద్యా సంవత్సరం ముగియడానికి మరి కొన్ని నెలలు మాత్రమే మిగలడంతో పాఠశాలలు తెరవాలని ప్రభుత్వం భావిస్తోంది. వార్షిక పరీక్షలు నిర్వహించే ముందు పాఠశాలలను కనీసం మూడునెలలపాటు తెరవాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం అనుమతిస్తే జనవరి నాలుగో తేదీ నుంచే పాఠశాలలు, జూనియర్ కాలేజీలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. తొలుత 9, 10 తరగతులు, జూనియర్ కాలేజీలలో రెగ్యులర్ క్లాసులు నిర్వహించేందుకు ప్రతిపాదనలు రూపొందించింది. ఆ తరువాత దశల వారీగా 6 నుంచి 8, ఆ తర్వాత ప్రాథమిక తరగతులను రెగ్యులర్‌గా నిర్వహించాలని భావిస్తోంది.తమ ప్రతిపాదనలను సీఎం కేసీఆర్‌కు పంపించామని విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారం వెల్లడించారు. ఆన్‌లైన్ క్లాసుల పట్ల విద్యార్థులకు ఆసక్తి సన్నగిల్లుతున్నట్టు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ స్కూల్ టీచర్ల సంఘాల నాయకులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు బడులు తెరవాలని కోరుతూ వినతిపత్రాలు ఇచ్చారన్నారు.

# తెలంగాణలో నిజాం సర్కార్ ఉంది: తరుణ్ చుగ్




వివరాలు 3లో..

# కొవిడ్ ఓ ప్రపంచ యుద్ధం.. కార్చిచ్చులా వ్యాపించింది!



న్యూఢిల్లీ,డిసెంబర్ 18, ప్రజాపాలన : కరోనా మహమ్మారి ఓ ప్రపంచ యుద్ధమని, దేశంలో అది కార్చిచ్చులా వ్యాపించిందని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. మార్గదర్శకాలను సరిగా అమలు చేయకపోవడం, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను జారీ చేయకపోవడం వల్ల మహమ్మారి వేగంగా విస్తరించిందని కోర్టు అభిప్రాయ పడింది. కొవిడ్ వల్ల ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకంగా ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారని వ్యాఖ్యానించింది. కర్ఫ్యూ, లాక్‌డౌన్‌లాంటి నిర్ణయాలను అమలు చేసేటప్పుడు చాలా రోజుల ముందే ప్రకటన చేయాలని, దీనివల్ల ప్రజలు అందుకు తగినట్లు తమ జీవనోపాధిని మలచుకుంటారని జస్టిస్ అశోక్ భూషణ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. దేశంలో కరోనాపై యుద్ధం చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు 8 నెలలుగా నిర్విరామంగా పని చేస్తూ పూర్తిగా అలసిపోయారని, వారికి మధ్యమధ్యలో విశ్రాంతినిచ్చేలా ఓ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని వ్యాఖ్యానించింది. ఈ మహమ్మారి విజృంభిస్తున్న వేళ ప్రతి రాష్ట్రం అప్రమత్తంగా ఉంటూ కేంద్రంతో కలిసి పని చేయాలని సూచించింది.

# హుస్సేన్ సాగర్ లోకి త్వరలో ఎలక్ట్రికల్ క్రూజ్ లు: శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్,డిసెంబర్ 18, ప్రజాపాలన : నగరంలోని హుస్సేన్ సాగర్ జలాశయం లోకి నూతనంగా రెండు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఎలక్ట్రికల్ క్రూజ్ 80 సీట్ల సామర్థ్యం కలిగిన క్రూజ్ లను త్వరలో ప్రారంభిస్తున్నట్లుపర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. హుస్సేన్ సాగర్ జలాశయం లోని బోటింగ్ కేంద్రాన్ని సందర్శించారు. బోటింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. మిగతా 3లో..

# కరోనా వ్యాక్సిన్ తప్పనిసరి కాదు: ఆరోగ్య శాఖ



న్యూఢిల్లీ,డిసెంబర్ 18, ప్రజాపాలన : కరోనా వైరస్ వ్యాక్సిన్ తప్పనిసరి కాదు అని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. అయితే వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి వ్యాక్సిన్ రెండు డోసులు తీసుకోవడం మేలని చెప్పింది. గతంలో ఈ వైరస్ బారిన పడ్డారా లేదా అన్నదానితో సంబంధం లేకుండా అందరూ పూర్తి స్థాయి వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించింది. దీనివల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పింది. రెండో డోసు తీసుకున్న రెండు వారాల్లోపు శరీరంలో పూర్తిస్థాయిలో యాంటీబాడీస్ వృద్ధి చెందుతాయని వెల్లడించింది. ఇక సమర్థత విషయంలో ఇండియాలో తయారైన వ్యాక్సిన్.. ఇతర దేశాల వ్యాక్సిన్‌లకు ఏమాత్రం తీసిపోవని కూడా తెలిపింది. వ్యాక్సినేషన్‌కు సంబంధించి తరచూ అడిగే ప్రశ్నల జాబితాను గురువారం రాత్రి రూపొందించిన ఆరోగ్య శాఖ.. మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చింది. ప్రస్తుతం దేశంలో మొత్తం 6 వ్యాక్సిన్‌లు వివిధ ప్రయోగ దశల్లో ఉన్నట్లు తెలిపింది. వ్యాక్సిన్‌లను పూర్తి స్థాయిలో పరీక్షించి, ప్రయోగాలు జరిపిన తర్వాతే అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. క్యాన్సర్, డయాబెటిస్, హైబీపీలతో బాధపడుతున్న వాళ్లు ఈ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా తీసుకుంటే మేలని ఆరోగ్య శాఖ సూచించింది. 28 రోజుల వ్యవధిలో రెండు డోసుల వ్యాక్సిన్‌ను తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. వ్యాక్సిన్ వల్ల సహజంగా ఉండే సైడ్ ఎఫెక్ట్స్ ఎలాగూ ఉంటాయని, వ్యాక్సిన్ ఇచ్చిన ప్రదేశంలో నొప్పి, జ్వరంలాంటివే సాధారణమేనని ఆరోగ్య శాఖ చెప్పింది. వ్యాక్సిన్ పంపిణీతోపాటు ఈ సైడ్ ఎఫెక్ట్స్‌ను కూడా ఎదుర్కొనేలా రాష్ట్రాలు సిద్ధంగా ఉండాలని సూచించింది. ప్రాధాన్యతా క్రమంలో వ్యాక్సిన్ అందరికీ అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేసింది.



# మీర్ పేట్ పోలీస్ స్టేషన్ సీఐ తో పాటు పలువురికి అవార్డ్స్

బాలాపూర్ : ప్రజాపాలన: బాలాపూర్ మండలం లోని మీర్పేట్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి రివార్డులు. రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని రివార్డ్ మేళా జరిగింది, పోలిస్ ప్రాసెక్యూషన్ ఆఫీసర్స్ కు రివార్డ్స్ ఇచ్చారు. అదేవిధంగా మీర్పేట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కి రివార్డ్స్ లభించాయి, పలు కేసులను దర్యాప్తులో సమర్థవంతంగా వ్యవహారించినందుకు సీఐ మహేందర్ రెడ్డి కి పలువురికి రివార్డులు లభించాయి. మర్డర్ కేసు లో నేరస్థునడికి జీవిత ఖైదు శిక్ష పడడం లో కృషి చేసిన ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డికి, చెడ్డి గ్యాంగ్ ను పట్టుకొని వాళ్లకు శిక్షపడేలా కృషిచేసిన మీర్పేట్ పోలీస్ స్టేషన్ డి ఐ సత్యనారాయణ, అలాగే కోర్ట్ డ్యూటీ చక్కగా నిర్వహించిన పోలీస్ సిబ్బంది భీమా కుమార్ , హరికృష్ణ,లకు మరియు కోర్ట్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ వాళ్లకు రివార్డ్స్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ ( లా అండ్ ఆర్డర్) డాక్టర్ జితేందర్ ఐ పి ఎస్ , రాచకొండ మహేష్ భగవత్ ఐ.పీ.ఎస్, కమీషనర్ అఫ్ పోలీస్ వైజయంతి, డైరెక్టర్ అఫ్ ప్రాసెక్యూషన్స్ లు కలిసి వారి చేతుల మీదగా అవార్డ్స్ అందుకున్న మీర్ పేట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది. ఉన్నతధికారులు మీర్పేట్ పోలిసుల యొక్క ప్రతిభను గుర్తించి రివార్డ్స్ ప్రకటించడం పట్ల మీర్పేట్ పోలీస్స్టేషన్ సీఐ మహేందర్ రెడ్డి వారి సిబ్బందిని, వనస్తలిపురం ఏ.సీ పీ పురుషోత్తం రెడ్డి ఎల్బీనగర్ డి సి పి సన్ ప్రీత్ సింగ్ అభినందించారు. మీర్పేట్ సీఐ



మహేందర్ రెడ్డి సంతోషంతో పోలీస్ సిబ్బందికి ఇంకా బాధ్యతలు చేపట్టి ప్రజల సుఖ సంతోషాలతో ఉండాలని, పోలీసులంటే భయభ్రాంతులు కాకుండా ప్రజల్లో కలిసిపోయి. వారితోపాటు ఆలోచించే సమయం వృధా చేయకుండా ఎల్లవేళల ప్రజలకు రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు.

## జనగామ జిల్లా కన్వీనర్‌గా గొరిగె ఉపేందర్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 18 (ప్రజాపాలన ): జనగామ జిల్లా బలహీన వర్గాల సంక్షేమ సంఘం కన్వీనర్ గా గొరిగె ఉపేందర్ ను నియమించామని రాష్ట్ర బివిఎస్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకట్ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాలు విద్య, వైద్య, రాజకీయ రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. చట్ట సభలలోకి రావాలంటే మనమంతా సమన్వయంతో, సమిష్టిగా, హక్కుల పోరాటానికి సిద్ధం కావలసిన ఆవశ్యకత ఉందని గుర్తు చేశారు. అగ్ర వర్ణాల పాలనలో ఇంకెన్నాళ్ళు బానిస బతుకు బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే సంఘటితం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కర్రె శ్రీనివాస్ కొరికె మదర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్యాట శంకర్ డి. వేంకటేశ్వర రావు రాష్ట్ర సలహాదారు వి. అమరేశ్వర్ రాష్ట్ర కార్యదర్శి పి. మైపాల్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో త్వరలో డయాల్ సిస్ కేంద్రం

**డిఎంహెచ్ఓ కొమరం బాలు**

**విశ్రాంత ఉద్యోగుల 39 వ వార్షికోత్సవం**

**జిల్లా అధ్యక్షుడు కర్ణ గౌడ్**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్17(ప్రజాపాలన): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో త్వరలో డయాల్ సిస్ కేంద్రం రానున్నట్లు జిల్లా వైద్యాధికారి కొమరం బాలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో గురువారం నిర్వహించిన 39 వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు వైద్య ఆరోగ్య శాఖ నుండి ఎప్పుడూ తోడ్పాటు ఉంటుందని అన్నారు. జిల్లా కేంద్రంలో డయాల్ సిస్ కేంద్రం కూడా త్వరలో రానున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంత ఉద్యోగులకు హెల్త్ పరంగా ఏవైనా సమస్యలు ఉంటే నన్ను కలవాల్సిందిగా సూచించారు.అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణ గౌడ్ మాట్లాడుతూ ఖజానా శాఖ నుండి పెన్షనర్స్ కు రావాల్సిన డెత్ రిలీఫ్ డబ్బును, లైఫ్ టైం ఏరియాస్, ఇలాంటి స్థితిలో ఆపరాదని, వైద్యపరంగా వెల్నెర్ సెంటర్ పెట్టాలని కోరారు. కరోనా చికిత్సకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగం రావలసిన పిఆర్, సి డి ఎ, లను వెంటనే ప్రకటించాలన్నారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు లేవని, ఉన్న వారిని ప్రైవేట్ ఆస్పత్రిలో అంగీకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉద్యోగుల హెల్త్ కార్డులను అన్ని ఆస్పత్రులు అంగీకరించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. హెల్త్ కార్డులు లేని వారిని గుర్తించి ఖజానా శాఖ ద్వారా కార్డులు కల్పించాలని కోరారు. లేనట్లయితే తెలంగాణ ఉద్యమం ఆదర్శంగా మరో ఉద్యమం చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ప్రతినెల మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం రెబ్బెన మండలం లోని ఖైర్ గాం గ్రామానికి చెందిన వినోద్, రాణి, దంపతుల కూతురు వైష్ణవి ఎలాంటి కోచింగ్ లేకుండా"ఎం బి బి ఎస్" లో సీటు సంపాదించుకున్న నేపథ్యంలో వైష్ణవి ని జిల్లా వైద్యాధికారి కొమరం బాలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్నగర్,యూనిట్ సభ్యులు, జిల్లా కార్యదర్శి సదానందం,నారాయణ, నరసింహారావు, మక్బూల్ హుస్సేన్, రమేష్, నాగయ్య నూరు, పాల్గొన్నారు.

## కేసులను సత్వరం విచారించి

# బాధితులకు సకాలంలో న్యాయం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి




మంచిర్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 18, ప్రజాపాలన : జిల్లాలోని ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్, మానిటరింగ్ పరిధిలో పోలీస్, రెవెన్యూ శాఖలకు సంబంధించి కేసులను సత్వరం విచారించి బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నమోదు అయిన కేసులను సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం చేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కులాంతర వివాహం చేసుకున్న ఇద్దరు దంపతులు బొట్ల ప్రశాంత్-జవ్వాజి ఉమాదేవి, గొర్లపల్లి నవీన్-చంద్రగిరి వందనలకు ఒక్కొక్క జంటకు 2 లక్షల 50 వేల రూపాయల చొప్పున ప్రోత్సహకాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు పి.రవీందర్ రెడ్డి, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి శ్యామలాదేవి కమిటీ సభ్యులు జిల్లపెల్లి వెంకటేష్, బచ్చల అంజన్న, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రకృతి వనం, పల్లెప్రగతి పనుల పర్యవేక్షణ:జిల్లా కలెక్టర్ జి.రవి



జగిత్యాల, డిసెంబర్ 18 (ప్రజాపాలన): జగిత్యాల జిల్లా కలెక్టర్ జి.రవి పట్టణ ప్రకృతి వనం, పొడి వనరుల సేకరుణ కేంద్రలు మరియు జిల్లాలో జరుగుతున్న ఇతర కార్యక్రమాలను పరిశీలించి తదనంతరం పల్లెప్రగతి పనుల నిర్వహణపై మెటపల్లి, కోరుట్ల రెవెన్యూ డివిజన్ మండలం, కోడిమ్యాల్, మాల్యాల్ మండలం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి అభివృద్ధి కార్యక్రమాలపై సలహా సూచనలు చేశారు.



## ముస్లీం మైనార్టీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన) : జీడిమెట్ల ఆర్టీసీ డిపో ముస్లీం మైనార్టీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి సుభాష్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి, జీడిమెట్ల ముస్లీం మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై లెటర్ ప్యాడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ఫాయాజుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా అఫ్జల్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా మదర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం జీడిమెట్ల డిపో మేనేజర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం రోజు ముస్లీంలకు సెలవు ప్రకటించాలన్నారు. సూరారం కాలనీకి సరైన బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. బస్సులు మరమ్మతులు రావడంతో రోడ్లపైనే ఆగిపోతున్నాయని, ఆగకుండ చూడాలని కోరారు.

## వధూవరులను ఆశీర్వదించిన భట్టి సతీమణి

మధిర, డిసెంబర్ 18, ప్రజాపాలన :మధిర మండలం కృష్ణాపురం గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వేల్పుల చెంచయ్య కుమారుడు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు,వేల్పుల రాంప్రసాద్ , స్వర్ణకుమారి, గార్ల,వివాహ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సీఎల్పీ లీడర్ మరియు మధిర నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి, సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి, మల్లు నందిని విక్రమార్క హాజరై నూతన దంపతులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, చావా వేణు,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు కర్నాటి రామారావు,, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు బిట్రా ఉద్దండయ్య,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, పారుపల్లి విజయ్, చింత మాల శ్రీనివాస్, సైదిల్లీపురం గ్రామ సర్పంచ్ పులిబండ్ల చిట్టి బాబు,పట్టణ యస్సి సెల్ అధ్యక్షుడు గద్దల లాలయ్య , మోచర్ల సురేష్ ఆదూరు శ్రీనివాస్ , బాలు నాయక్, బండారు నరసింహారావు అంబర్పేట రామారావు చంప శాల రామకృష్ణ, మైలవరం చక్రి, తదితరులు ఈ కార్యక్రమానికి నూతన వధూవరులను ఆశీర్వదించారు



ఈనెల 30 న జన సోషలిస్ట్ పార్టీ జిల్లా సదస్సును జయప్రదం చేయండి

## ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ రావు

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి (ప్రజాపాలన): ఈనెల 30వ తేదీన జన సోషలిస్టు పార్టీ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని, శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసి రాయి సెంటర్ లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వర్గాల సమావేశనికి ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవ్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30వ తేదీన మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా స్థాయి సదస్సు జరుగుతుందని, ఇట్టి సదస్సుకు మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రతి గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్టు తెలిపారు. 2023 ఎన్నికలలో మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. సామాజిక తెలంగాణ మహాజన రాజ్యం స్థాపించుకోవాలన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనార్టీ వర్గాల ప్రతి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. జన సోషలిస్టు పార్టీ జిల్లాలోని ప్రతి గ్రామంలో విస్తరించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇట్టి సదస్సు విజయవంతం కావడానికి ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి బిసి సంగం రాష్ట్ర నాయకులు పూలబోయిన మొండయ్య, లోబడే లవ్ కుమార్, లను నియమించడం జరిగిందన్నారు. సిర్పూర్ నియోజకవర్గం నుండి మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు రాజి హైదర్, చంద్ర కుమార్, (అడ్వకేట్) లను నియమించడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రంలో 30 న జరిగే జిల్లా సదస్సుకు జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్ర కుమార్, శ్రీకాంత్, పరశురామ్, జాకీర్ ఖాన్, బాజీరావు, ఇతర కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశైలంకు పాదయాత్ర



కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన) :జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ శివాలయం నుంచి శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆధ్వర్యంలో 7వ సారి శ్రీశైలంకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ తండ్రి బండి సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యార్మీ ఉత్సవాలు హిందూ ముస్లీంల ఐక్యతకు నిదర్శనం

## కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్





కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన) :గ్యార్మీ ఉత్సవాలు హిందూ, ముస్లీంల ఐక్యతకు నిదర్శనమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లోని మహబూబ్ సుభాని దర్గా వద్ద ముస్లీం సోదరులు నిర్వహించిన గ్యార్మీ ఉత్సవాలలో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా ముస్లీం సోదరులు నిర్వహించే గ్యార్మీ ఉత్సవాలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్యార్మీ ఉత్సవాలు మతసామరాస్యానికి ప్రతికగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌడ శ్రీనివాస్‌రావు, ఫెరోజ్, హేస్సేన్, ఆబేద్, ప్రభాకర్‌గుప్త, బస్వరాజ్, మస్తాన్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

**పేద ప్రజల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి**

పేద ప్రజల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు లబ్దిదారులకు రూ.3 లక్షల విలువ చేసే కళ్యాణలక్ష్మీ చెక్కులను, మరో ఇద్దరు లబ్దిదారులకు రూ.4 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఎల్ఓసి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ పథకం పేద ప్రజలకు ఎంతో అసరాగా నిలుస్తుందన్నారు. పేదింటి ఆడపడుచుల వివాహాలకు భారం కాకుడదనే ఉద్దేశ్యంతో సీఎం కెసిఆర్ కళ్యాణలక్ష్మీ పథకం ప్రవేశపెట్టారన్నారు.

అనారోగ్యంతో భాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సహాయం అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం దోహదపడుతుందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ యాప్‌ల ద్వారా రుణాలు స్వీకరించొద్దు

### వేధింపులకు పాల్పడే యాప్‌లపై ఫిర్యాదు చేయండి డీజీపీ మహేందర్‌రెడ్డి



హైదరాబాద్: చట్టబద్ధత లేని యాప్‌ల ద్వారా రుణాలు స్వీకరించవద్దని డీజీపీ మహేందర్‌రెడ్డి సూచించారు. వేధింపులకు పాల్పడే యాప్‌ల పై ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆన్ లైన్, ఆఫ్ లైన్, బ్యాంకు నుండి గాని రుణాలు అందించేవారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా వర్తిస్తాయని డీజీపీ తెలిపారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో యాప్‌ల ద్వారా అనేక మందికి నగదు రుణాలు అందించి వాటిని తిరిగి చెల్లించే క్రమంలో చేసిన వేధింపులను భరించలేక పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డ సంఘటనలు జరిగాయి. ఈ నేపథ్యంలో డీజీపీ ఒక ప్రకటన విడదల చేశారు. ఆర్‌బీఐ చట్టం 1934లోని సెక్షన్ 45-1ఏ ప్రకారం ఏదైన నాన్ బ్యాకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు తగిన రిజిస్ట్రేషన్ అనంతరమే నిబంధనల మేరకు పనిచేయడానికి అనుమతి ఉందని తెలిపారు. ఆర్‌బీఐ చట్టానికి లోబడి రిజిస్టర్ కాని ఏ నాన్ బ్యాకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలకు చట్టబద్ధత లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం చలామణిలో ఉన్న ఈ ఆన్‌లైన్ యాప్‌లలో అధికశాతం ఆర్‌బీఐలో నమోదు కాలేదని, అందువల్ల వారికి రుణాలు అందించే అధికారం లేదని పేర్కొన్నారు. ఈ యాప్‌లలో అధికంగా చైనీస్‌వే ఉన్నాయని, వాటికి రిజిస్టర్ అయిన చిరునామా గాని, సరైన మొబైల్ నంబర్ గాని ఇతర వివరాలు ఉండవని పేర్కొన్నారు. ఫోన్ ద్వారానే సమాచారాన్ని (డేటా) ను యాప్‌ల నిర్వాహకులు తెలుసుకుంటారని, ఈ యాప్‌ల యూజర్లు లిఖిత పూర్వకంగా లేని రూపంలో తమ కాంటాక్ట్ నెంబర్లు, ఫోటోలు, వీడియోలు, సోషల్ మీడియా సమాచారం ఇతర వ్యక్తిగత సున్నిత అంశాలను తమకు తెలియకుండానే అందిస్తారు. యాప్‌ల ద్వారా తీసుకున్న రుణాలను చెల్లించని బాధితులను వేధించేందుకు ఈ సమాచారాన్ని రుణాలు అందించే యాప్‌ల నిర్వాహకులు దుర్వినియోగం చేస్తారు. ఈ నేపథ్యంలో రుణాలు స్వీకరించే సమయంలో ఏవిధమైన షరతులకు అంగీకరించవద్దని సూచించారు. ముఖ్యంగా మీ వ్యక్తిగత వివరాలు, ఆధార్, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లో అందజేయవద్దని తెలిపారు. ఇంటర్ నెట్ లో లభించే అనేక రుణాలు అందించే యాప్‌లు మోసపూరితమైనవని, ఆర్‌బీఐ గుర్తింపులేని ఈ యాప్‌ల ద్వారా రుణ ఆధారిత దరఖాస్తులను డౌన్ లోడ్ చేయకూడదని తెలిపారు. ఈ యాప్‌ల ద్వారా అందించే రుణాల వడ్డీ రేట్లు రోజుకు ఒక శాతం వరకు ఉంటాయి. ఇది సాధారణంగా బ్యాంకులు లేదా ఎన్‌బిఎఫ్‌సీ రిజిస్టర్ అయిన సంస్థలు అందించే రుణ వడ్డీలకన్నా అత్యధికం. రుణ బాధితులు సకాలంలో చెల్లించని పరిస్థితిలో ఈ వడ్డీ మొత్తం రెట్టింపు లేదా మూడొంతులు అయి రుణ వలయంలో చిక్కుకుంటారు. దీంతో రుణాలు చెల్లించని రుణ గ్రహీతలను తిరిగి చెల్లించమని బెదిరించడం, బ్లాక్ మెయిల్ చేయడంతో పాటు ఆన్‌లైన్ వేధింపులకు ఈ యాప్‌లు పాల్పడతాయి. రుణాలను చెల్లించనట్లైతే మీ పై క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని రుణం అందించే యాప్‌లు బెదిరించే అవకాశం ఉందని, ఈ పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని డీజీపీ తెలిపారు. ఆర్‌బీఐలో రిజిస్టర్ కాని, అక్రమ యాప్‌ల ద్వారా ఏవిధమైన రుణాలు స్వీకరించవద్దని డీజీపీ కార్యాలయం ప్రజలకు సూచించింది. ఈ విషయంలో ఎవరైన వేధింపులకు గురయితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని డీజీపీ మహేందర్‌రెడ్డి చెప్పారు.

# హుస్సేన్ సాగర్ లోకి త్వరలో ఎలక్ట్రికల్ క్రూజ్ లు: శ్రీనివాస్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)



అలాగే కొత్తగా సాగర్ జలాశయం లో రూపొందిస్తున్న క్రూజ్ బోట్ ల నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ అనేగానే హుస్సేన్ సాగర్, బుద్ధిని విగ్రహం సింబాలిక్ గా నిలిచిందన్నారు. కొత్తగా ఎలక్ట్రానిక్ క్రుజర్, బోట్ లను పర్యావరణ పరిరక్షణ లో భాగంగా దేశంలోనే మొదటి సారి గా ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఇందులో బర్త్ డే,ఇతర వేడుకలు జరుపుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.దుర్గం చెరువు లో మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు కూడా రెండు బోట్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్, తెలంగాణ వ్యాప్తంగా కూడా టూరిజం స్పాట్ గా అవతరిస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత విదేశీ టూరిస్ట్ ల సంఖ్య పెరుగుతోందన్నారు. కరోనా నేపథ్యంలో కొంత తగ్గిన మళ్ళీ పుంజుకుందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. యాదాద్రి ఆలయం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అయితే అక్కడ విదేశీ టూరిస్ట్ లను ఆకట్టుకునేందుకు మరింత అద్భుతమైన టూరిజం స్పాట్ ఏర్పాటు కాబోతుందన్నారు. రానున్న కొద్దిరోజుల్లో పర్యావరణ పరిరక్షణ లో భాగంగా సోలార్,ఎలక్ట్రిక్ బోట్ లను అందుబాటులోకి తెస్తామన్నారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల మనకు సముద్రం లా నీళ్లు ఉన్నాయి.వాటిలో కూడా టూరిజం ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మూవింగ్ రెస్టారెంట్ 80 సీట్లతో సోలార్ క్రుజర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ ఆధునిక హంగులు కలిగిన క్రూజ్ లను సాగర్ జలాశయం లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలోపర్యాటక శాఖ ఎండీ మనోహర్ రావు, ఈడీ శంకర్ రెడ్డి, జీఎం ఇబ్రహీం, పర్యాటక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## తుపాకీతో రెచ్చిపోయిన ఎంఐఎం నేత

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తాటిగూడలో తుపాకీ కాల్పులు కలకలం రేపాయి. ఎంఐఎం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఫారూఖ్ అహ్మద్ రివాల్వర్‌తో స్థానికులను బెంబేలెత్తించాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా పడ్డారు. ఫారూఖ్ రెండు రౌండ్లు కాల్పులు జరపగా ఒకరికి తల, మరొకరికి పొట్ట భాగంలో బులెట్లు దూసుకెళ్లాయి. క్షతగాత్రులను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. పాత కక్షల నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్టుగా తెలిసింది. తొలుత ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కాల్పులకు దారితీసినట్టుగా స్థానికులు చెప్తున్నారు. ఒక చేతిలో కత్తి, మరో చేతిలో తుపాకీతో ఫారూఖ్ వీర విహారం చేశాడు. కాల్పుల ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది.

అదులోకి నిందితుడు

తాటిగూడలో కాల్పులకు సంబంధించి ఐజీ నాగిరెడ్డి స్పందించారు. నిందితుడు ఫారూఖ్ అహ్మద్‌ను అదులోకి తీసుకుని విచారిస్తున్నామని అన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని ఐజీ పేర్కొన్నారు. వారంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఫారూఖ్ లైసెన్స్‌డ్ గన్‌తో కాల్పులు జరిపారని వెల్లడించారు. క్రికెట్ గేమ్ ఆడుతున్న వారి పిల్లల గొడవ కాల్పులకు దారితీసినట్టుగా తెలుస్తోందని నాగిరెడ్డి అన్నారు. ఫారూఖ్ నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఇంచార్జి ఎస్పీ సత్యనారాయణ తెలిపారు. గాడపడ్డవారికి ప్రాణాపాయం తప్పిందని చెప్పారు.

## సంజయ్ నీకిదే మొదటి.. చివరి పదవి:ఎర్రబెల్లి

(మొదటి పేజీ తరువాయి)

బండి సంజయ్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదు. కేసీఆర్ గురించి మాట్లాడితే, పెద్ద వాడివి కాలేవు. తెలంగాణ ప్రజలు మిమ్మల్ని క్షమించరని గుర్తు పెట్టుకోవాలన్నారు. కేసీఆర్ మీలా అల్లాటప్పా లీడర్ కాదు. ఉద్యమ నాయకులు. తెలంగాణ తెచ్చిన ప్రజా నేత. తెలంగాణ కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టి చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించారన్నారు. కేటీఆర్, కవిత ఉద్యమాల నుంచి వచ్చిన వాళ్ళేనన్నారు. భాగ్యలక్ష్మి ఆలయాన్ని అడ్డుపెట్టుకుని మత కలహాలు సృష్టించాలని సూచిస్తున్నావు. మత ఘర్షణలు పెట్టాలని చూస్తున్నారు. కరోనా కారణంగానే జీహెచ్‌ఎంసీ ఎన్నికలు ముందు పెట్టాల్సి వచ్చింది. ముందు అయితే ముందు అంటారు. వెనుకకు అయితే, వెనక అంటారు. మేయర్ ఎన్నికలకు ఇంకా రెండు నెలల టైముంది. ఇప్పుడే ఎందుకు తొందర అన్నారు. ఒక వారంలోనే రిజిస్ట్రేషన్ సమస్య తీరుతుందన్నారు. ప్రజల కోసమే కొత్త రెవెన్యూ చట్టం తెచ్చాం. రిజిస్ట్రేషన్స్ కూడా బాగున్నాయి అని ప్రజలు అభినందిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

## తెలంగాణలో నిజాం సర్కార్ ఉంది: తరుణ్ చుగ్

హైదరాబాద్, డిసెంబర్ 18, ప్రజాపాలన : సీఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ మండిపడ్డారు. తండ్రి, కొడుకుల పార్టీ తెలంగాణను దోచుకుంటోందని ఆరోపించారు. కుటుంబ పాలనతో లూటీ చేస్తున్నారని, తెలంగాణలో నిజాం సర్కార్ ఉందన్నారు. తెలంగాణ సచివాలయంలో ఎవరూ ఉండరని ఆయన ఎద్దేవాచేశారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తరుణ్ చుగ్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో తరుణ్ చుగ్ పర్యటించారు. రాష్ట్ర బీజేపీ నేతలు బండి సంజయ్, ఎంపీ అర్వింద్, రాజాసింగ్, వివేక్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ ఉప ఎన్నిక, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు.

## ట్రాన్స్‌ట్రాయ్ కేసులో ముగిసిన సీబీఐ సోదాలు

హైదరాబాద్: ట్రాన్స్‌ట్రాయ్ కేసులో సీబీఐ సోదాలు ముగిశాయి. మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, చెరుకూరు శ్రీధర్, అక్కినేని సతీష్‌తో పాటు ఆరుగురు ఇళ్లల్లో సీబీఐ సోదాలు ముగిశాయి. పలు బ్యాంకుల నుంచి రూ.7,926 కోట్లు రుణాలు ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ తీసుకుంది. తీసుకున్న రుణాలకు ట్రాన్స్‌ట్రాయ్ సరైన ఆధారాలు చూపించలేదు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో నిధులు పక్కదారి ట్రాన్స్‌ట్రాయ్ పట్టించింది. తప్పుడు పత్రాలు, నివేదికలతో కెనరా బ్యాంకును మోసం చేసింది. రుణసదుపాయాన్ని ట్రాన్స్‌ట్రాయ్ పూర్తిగా దుర్వినియోగం చేసింది. రాయపాటి సాంబశివరావు నివాసాల్లో సీబీఐ సోదాలు ముగిశాయి. ట్రాన్స్‌ట్రాయ్ సంస్థతో ఉన్న సంబంధాలపై రాయపాటిని సీబీఐ బృందం ప్రశ్నించినట్లు తెలుస్తోంది. బెంగళూరు నుంచి వచ్చిన సీబీఐ అధికారులు ఏకంగా 7 గంటల పాటు విచారణ కొనసాగించారు. ట్రాన్స్‌రాయ్ సంస్థ బెంగళూరులోని కెనరా బ్యాంక్‌కు రుణాలు చెల్లించలేదు. ఇందులో భాగంగానే కెనరా బ్యాంకు ఉద్యోగులతో కలిసే సీబీఐ అధికారులు రాయపాటి నివాసాలకు చేరుకున్నారు. ఈ రెండు సంస్థల మధ్య జరిగిన లావాదేవీలపై, ట్రాన్స్‌ట్రాయ్ సంస్థతో ఉన్న సంబంధాలపై రాయపాటిని సీబీఐ బృందం ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

## ఎమ్మెల్యేతో పని చేయించుకున్న పిల్లోడు

కరీంనగర్: ప్రజాప్రతినిధి ఎదురుగా కనిపిస్తే తమ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం ఏం చేశారని ఎవరికైనా అడగాలనిపిస్తుంది. కానీ అధికారాన్ని నేరుగా ప్రశ్నించే ధైర్యం చాలా మందికి ఉండదు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో ఓ బాలుడు మాత్రం తమ కాలనీకి రోడ్డు సమస్య పరిష్కారం కావడానికి నేరుగా ఎమ్మెల్యేనే ప్రశ్నించాడు. తమ కాలనీకి రోడ్డు ఎప్పుడు వేయిస్తారని ప్రశ్నించాడు. పెద్దల నుంచి రాని ప్రశ్న బాలుడి నోట వెంట వచ్చే సరికి ఎమ్మెల్యే రవి శంకర్ కూడా ముచ్చటపడ్డారు. వెంటనే బాలుడిని దగ్గరికి తీసుకుని వివరాలు అడిగి తీసుకున్నారు.

# మహిళాశక్తిని మించిన శక్తి ప్రపంచంలో మరోటి లేదు



భువనగిరి: మహిళాశక్తిని మించిన శక్తి ప్రపంచంలో మరోటి లేదని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితాసబర్వాల్ అన్నారు. మహిళల భద్రత కోసం ఐఏఎస్ , ఐపిఎస్ మహిళా అధికారులతో ఏర్పాటైన అత్యున్నతస్థాయి కోర్ గ్రూప్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. భువనగిరిలో జరిగిన ఈసమావేశంలో అత్యవసర సహాయం కోసం , భద్రతకోసం ఏర్పాటుచేసిన డయల్ 100, 181 తదితర హెల్ప్‌లైన్ వ్యవస్థల పనితీరు గురించి , ఇతర సలహాలను, సూచనలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రతా పరమైన సమస్యలు తెలుసుకుని ఉన్నతస్థాయికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణలోని ప్రతి మహిళా భద్రతతో ఉండేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు. మహిళల భద్రత , రక్షణ కోసం హెల్ప్‌లైన్‌నెంబర్లపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న భరోసాతో పాటు చేపట్టాల్సిన చర్యలను క్షేత్రస్థాయిలో నిజానిజాలు తెలుసుకుని నివేదికను రూపొందిస్తామని తెలిపారు. గత 4, 5 సంవత్సరాల్లో ఇదే కమిటీ నివేదిక ఆధారంగా షీ టీమ్స్ ఏర్పాటు అయ్యిందన్నారు. ఉద్యోగులు పనిచేసే చోట లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసినట్టయితే కలెక్టర్లు వ్యక్తిగతంగా స్పందించి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ విషయంలో సర్క్యులర్ ఆదేశాలు ఉన్నందున బాధ్యులను అక్కడిక్కడే సస్పెండ్ చేయంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్లను కోరారు. ఈ విషయంలో ఇంకా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేందుకు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. గ్రామాలలో స్థలాలు లేకున్నా సిసిరోడ్లు కావాలని కోరడం కాకుంఆ భద్రత కోసం వీధి దీపాలు కావాలని, పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రశ్నించాలని ఆమె అన్నారు. హింస జరిగిన వెంటనే 181 నెంబరు ద్వారా సఖి సెంటర్ హెల్ప్‌లైన్‌కు కాల్‌చేయాలన్నారు. అవసరమైతే 100 హెల్ప్‌లైన్‌కు వెంటనే ఫార్వర్డ్ చేసే బాధితులకు సత్వర భద్రత చేకూర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలను అధిగమించేందుకు మానసికంగా బలోపేతం కావాలన్నారు. సమావేశంలో స్త్రీ, శిశుసంక్షేమశాఖ కమిషనర్ దివ్య దేవరాజ్, ఐఏఎస్ అధికారి యోగితా రాణా, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ, హైదరాబాద్ కలెక్టర్ శ్వేతా మహంతి, నల్గొండ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, భువనగిరి జిల్లా కలెక్టర్ అనితా రాంచంద్రన్, హైదరాబాద్ షీటీమ్ ఇన్‌చార్జి అనసూయ పాల్గొన్నారు.


## అంబేడ్కర్ రాజనీతి ఉద్యమం

Ambedkar Rajaneethi Movement (ARM)

www.ambedkarrajaneethi.com

### బహుజనుల కోసం డిమాండ్లు

1. మద్యపానాన్ని నిషేధించాలి
2. మహిళలకు అన్నింటా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి.
3. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలి.
4. న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు కల్పించాలి.
5. వెనుకబడిన తరగతులకు చట్ట సభల్లో 50 - రిజర్వేషన్ కల్పించాలి.
6. ఎస్సీ లకు మత స్వేచ్ఛ కల్పించాలి.
7. బుద్ధుడు ప్రవచించిన సమతా భావాన్ని సమర్థించేలా చర్యలు చేపట్టాలి.
8. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని కులాలకు రిజర్వేషన్ కల్పించాలి.
9. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.
10. రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలి.
11. అందరికి ఉచిత విద్య కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టాలి.
12. ప్రైవేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి. ఇప్పటికే ఉన్న ప్రైవేటు విద్యా సంస్థల్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలి.
13. ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం అందించాలి.
14. ప్రైవేట్ ఆస్పత్రులను రద్దు చేయాలి.
15. పరిశ్రమల్ని జాతీయం చేయాలి. ప్రైవేట్ రంగంలో నడిచే పరిశ్రమల్లో రిజర్వేషన్ కల్పించాలి.
16. ఆధార్ కార్డు ఉన్న ప్రతి పౌరుడికి 2,00,000/- రూపాయలు ఋణం ఇవ్వాలి. సక్రమ చెల్లింపుపై తరువాత సంవత్సరం రెట్టింపు ఋణం ఇవ్వాలి.
17. భూమిలేని రైతులకు ప్రభుత్వ/దేవాలయ లేదా ఇతరత్రా ఏదైనా 4 ఎకరాల భూమి ఇవ్వాలి.
18. ప్రతీ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలి.
19. వలసలను అరికట్టేందుకు ఎక్కడికి అక్కడే గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త సాంకేతిక వ్యవసాయ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
20. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చి సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి.
21. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలను ముందుగానే ప్రకటించాలి.

ఇటువంటి విలువైన అంశాలు ఇంకా ఏవైనా ఉంటే దయచేసి మా దృష్టికి తీసుకురండి.

### ఆహ్వానం

అంబేడ్కర్ రాజనీతి ఉద్యమంలో భాగస్వాములుగా చేరేందుకు బహుజనులందరికీ ఆహ్వానం.

## జై భీం, జై ఫూలే, జై బహుజన

సెంట్రల్ వర్కింగ్ కమిటీ
అంబేడ్కర్ రాజనీతి మూవ్ మెంట్

ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 19, డిసెంబరు 2020

# అడకత్తెరలో మోదీ

ప్రధాని మోదీ ఇప్పుడు ఏం చేస్తే ఏం జరుగుతుందనేది కీలకంగా మారింది. అన్నదాతల డిమాండ్లు ఆమోదిస్తే కార్పొరేట్ ఎజెండా ఓడిపోతుంది. రైతుల కోర్కెలు అంగీకరించకపోతే, ఉద్యమం ఉధృతమై కార్పొరేట్ వ్యతిరేక ఆర్థిక ఎజెండా ముఖ్య రాజకీయ ఎజెండాగా మారిపోతుంది. మోదీ అధికారానికే కాలం చెల్లే పరిస్థితి వస్తుంది.రాజధాని ఢిల్లీ కేంద్రంగా గత మూడు వారాలుగా సాగుతున్న 'రైతాంగ ఉద్యమం' ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి 'వెనక గొయ్యి.. ముందు నుయ్యి'గా మారుతోంది. అందుకే ఉద్యమం ఎంత ఉధృతంగా సాగుతున్నా, వ్యవసాయ చట్టాలను రద్దు చేసేదాకా వెనక్కు తగ్గేది లేదని అన్నదాతలు తెగేసి చెబుతున్నా, తెచ్చిన చట్టాలకు ఏవైనా 'కొన్ని' సవరణలు చేస్తాము తప్ప వాటిని మొత్తంగా రద్దు చేసే సమస్యేలేదని ప్రభుత్వం మొండి పట్టుదలకు పోతున్నది. చర్చలు జరుగుతుండగానే ప్రధాన మంత్రి ఈ చట్టాల విశిష్టత గురించి ప్రచారం చేయడాన్ని బట్టి వాటిని రద్దుచేసే ఉద్దేశమేదీ ప్రభుత్వానికి లేదని స్పష్టమౌతున్నది. మరోవైపు రైతులను వివిధ రాజకీయ శక్తులు రెచ్చగొడుతున్నాయని శాపనార్థాలు పెడుతున్నారు. ఉద్యమంలో చీలికలు తెచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు.ప్రధాని మోదీ ఆరోపిస్తున్నట్లుగా ప్రస్తుత రైతు ఉద్యమం రాజకీయ ప్రేరేపితం కాదు. వ్యవసాయ రంగాన్ని అస్తవ్యస్తంజేసే అప్రజాస్వామిక చట్టాలను ఆయన తీసుకొచ్చిన తీరే రైతులను ఉద్యమాలకు ఉసిగొల్పింది. అంతేగాక ఈ ఉద్యమం రాజకీయాలపైనే బలమైన ప్రభావం చూపుతోంది. ఇప్పటివరకూ బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు పథకం ప్రకారం ముందుకు తెచ్చిన మతోన్మాద, జాతీయోన్మాద ఎజెండాను వెనక్కు నెట్టి, ఆర్థిక ఎజెండా తిరిగి ముందుకు వచ్చే ప్రక్రియ జోరందుకుంటున్నది. ప్రజల నిత్యజీవిత సమస్యలైన ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, ఉద్యోగాలు, భూమి, వేతనాలు, సంక్షేమం, విద్యా, వైద్యం, గృహవసతి, సామాజిక న్యాయం వగైరాలే గత వందేళ్లకు పైగా మన దేశ రాజకీయాల్లో ప్రధాన ఎజెండాగా ఉన్నాయి. దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ వీటి చుట్టూనే తమ వాగ్దానాలు, కార్యాచరణలూ నడిపాయి. కానీ ఆర్ఎస్ఎస్ ప్రోద్బలంతో భారతీయ జనతా పార్టీ రాజకీయాల ఫోకస్‌ను ఈ ఎజెండా నుంచి తప్పించి, హిందూత్వ ఎజెండాను ముందుకు తేగలిగింది. అదే దాని విజయ రహస్యం.రాజకీయ ఎజెండాను పూర్తిగా మార్చివేసే బిజెపి ప్రయత్నాలకు మన దేశ కార్పొరేట్ శక్తుల అండ కూడా పుష్కలంగా లభించింది. 1990ల నుంచి అమలు జరుగుతున్న ఆర్థిక సంస్కరణలతో పెరిగిన అసమానతలు, పేదరికం వల్ల ప్రజల్లో అసంతృప్తి, ఆగ్రహాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఆగ్రహం నుంచి ఐక్య ఉద్యమాలు ఆవిర్భవించకుండా ఉండాలంటే ప్రజల మధ్య చీలికలు, ఘర్షణలు అవసరం అనేది కార్పొరేట్ ఎజెండాగా ఉంది. ఈ దేశంలో హిందూత్వ రాజ్యం నెలకొల్పాలనే బిజెపి సంకల్పం ఈ ఎజెండాకు అతికినట్టుగా సరిపోయింది. కాబట్టే మన కాషాయ పాలకులకు, కార్పొరేట్ శక్తులకు బలమైన 'ఫెవికాల్' బంధం ఏర్పడింది. హిందూత్వ ఎజెండా బిజెపి వేగవంతమైన రాజకీయ పెరుగుదలకు కూడా బాగా తోడ్పడింది. అయితే రైతుల, కార్మికుల పోరాటాలతో నిత్యజీవిత సమస్యల ఎజెండాకు ఊపిరొచ్చింది. అవి ప్రధాన ఎజెండాగా రాజకీయాల్లో ముందుకు రావటం ప్రారంభమైంది.కాబట్టి ఇపుడు మోదీ ఏం చేయాలనేదీ, ఏం చేయబోతున్నాడనేదీ, ఏం చేస్తే ఏం జరుగుతుందనేదీ కీలకంగా మారింది. రైతు ఉద్యమం ఐక్యంగా, బలంగా ఉంది కాబట్టి, ఇప్పటివరకూ రైతు సంక్షేమమే మా లక్ష్యం అంటూ గొప్పలుపోయారు కాబట్టి వారి కోర్కెలు ఆమోదిస్తే కార్పొరేట్ ఎజెండా ఓడిపోతుంది. అదే జరిగితే ఈ చట్టాలే కాకుండా భవిష్యత్తులో మొత్తం ఆర్థిక సంస్కరణలే ఆగిపోతాయనే భయం. దాంతోపాటు మోదీ స్ట్రాంగ్ మాన్ ఇమేజీ పడిపోతుంది. మరోవైపు రైతుల కోర్కెలు అంగీకరించకపోతే, ఉద్యమం ఉధృతమై ఇతర వర్గాల ప్రజలు ముఖ్యంగా కార్మికులు దీర్ఘకాల పోరాటాలకు సిద్ధమైతే, హిందూత్వ ఎజెండా పక్కకుపోయి, కార్పొరేట్ వ్యతిరేక ఆర్థిక ఎజెండా ముఖ్యమైన రాజకీయ ఎజెండాగా మారిపోతే మోదీ రాజకీయాధికారానికి కాలం చెల్లే పరిస్థితి వస్తుంది.వెనక గొయ్యి... ముందు నుయ్యి లాంటి ఈ ఇరకాటంలోంచి బయటపడేందుకే నిందలు వేసైనా, కుట్రలు చేసైనా ఈ ఉద్యమాన్ని నీరుగార్చాలని, చీలికలు సృష్టించాలని మోదీ, ఆయన అనుయాయులు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో మోదీ జయాపజయాలు రైతాంగం ప్రదర్శించే ఐక్యతపైనా, ఆ ఉద్యమానికి ఇతర ప్రజలు క్రియాశీలంగా ఇచ్చే మద్దతుపైనా ఆధారపడి ఉంటాయి. మోదీ ప్రభృతుల ప్రయత్నాలను నిలవరించటం మన దేశ ఆహార భద్రతనూ, అన్నదాతలనూ ఆదుకోవాలనుకునే దేశభక్తులందరి కర్తవ్యంగా భావించాలి.

# అన్నా ఉద్యమం-అన్నదాత పోరు

అవినీతిని కూకటివేళ్ళతో పెకిలించివేయాలనే లక్ష్యంతో అన్నా హాజారే 2011లో నిర్వహించిన ఆందోళన మన్మోహన్ సింగ్ ప్రభుత్వ ప్రతిష్ఠను కూల్చివేసినట్టుగా 2020లో కొత్త సాగు శాసనాలకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన నిరసనలు మోదీ సర్కార్ మనుగడను దెబ్బతీస్తాయా? నూతన వ్యవసాయ చట్టాలపై రైతుల అసంతృప్తి అంత తేలిగ్గా తొలగిపోదు. మోదీ ప్రభుత్వం దిగిరాదు. ఈ రాజకీయ శీత ఋుతువు ప్రస్తుత ప్రాకృతిక చలికాలం అనంతరమూ కొనసాగే అవకాశం ఉంది. అన్నదాతలు అసహాయులు కారు. రైతు సంఘాల పిలుపు మేరకు ఈ నెల 9న జరిగిన భారత్ బంద్‌కు ఆసేతు హిమాచలం సకల సామాజిక వర్గాల వారూ మద్దతు తెలిపారు. నిరసనలలో పాల్గొన్నారు. ప్రజల మనస్సులపై ప్రగాఢ ముద్ర వేసిన ఆ అలజడి దృశ్యాలలో ఒకటి ప్రత్యేకంగా ప్రస్తావనార్హమైనది. రైతుల డిమాండ్లను సమర్థిస్తూ సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరాహార దీక్ష నిర్వహించారు. ఆ సందర్భంగా రికార్డు చేసిన అన్నా సందేశం ఒకదాన్ని ఆయన స్వగ్రామం రాలేగావ్ సిద్ధి నుంచి అన్ని టీవీ ఛానెల్స్‌కు పంపించారు. చాలా ఛానెల్స్ దాన్ని పట్టించుకోలేదు. ఆహా?! కాలమహిమ! అనేకానేక టీవీ కెమెరా బృందాలు ఈ గాంధేయవాదిని అనుక్షణమూ అనుసరించింది అటు మొన్ననే కాదూ? మన కాలం మహాత్ముడుగా ఆయన్ని అభివర్ణించని వార్తాపత్రిక ఏదైనా ఉన్నదా? భారత రాజకీయాలలో 'అన్నా ఘట్టం' ఎంత త్వరగా ఆరంభమయిందో అంత శీఘ్రంగా ముగిసిపోయింది.ప్రశ్న ఏమిటంటే ఇప్పుడు సువ్యవస్థిత అధికార రాజకీయాలపై తిరుగుబాటు ధ్వజాన్ని ఎగురవేస్తోన్న కొత్త నిరసనకారులు ఆ మహత్వపూరిత 'అన్నా ఘట్టం'ను పునరావృతం చేయగలరా? ఇదే ప్రశ్నను మరింత స్పష్టంగా మీ ముందు ఉంచుతాను: 2011లో అవినీతిని కూకటివేళ్ళతో పెకిలించివేయాలనే లక్ష్యంతో అన్నా హజారే నిర్వహించిన ఆందోళన మన్మోహన్ సింగ్ ప్రభుత్వ ప్రతిష్ఠను కూల్చివేసినట్టుగా 2020లో కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన నిరసనలు మోదీ సర్కార్ మనుగడను దెబ్బ తీస్తాయా? అన్నా హజారే ఉద్యమం ఏం సాధించింది? కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వ ప్రతిష్ఠా భంగం, అంతిమ పతనంలో ఉద్యమం ఒక ఉత్ప్రేరకంగా పనిచేసింది. ఇందులో ఎవరికీ ఎటువంటి సందేహం లేదు. అవినీతి నిర్మూలన ఒక తక్షణ రాజకీయ కర్తవ్యంగా నిర్దేశించింది. పాలనావ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని దృఢతరం చేసింది. కార్యనిర్వాహకవర్గాన్ని దుర్బల పరిచింది. నరేంద్ర మోదీ లాంటి 'శక్తిమంతుడైన' నాయకుడి ఆవిర్భావానికి రంగాన్ని సిద్ధం చేసింది. చరిత్ర ముందుకు నడిచింది. నరేంద్ర మోదీ వచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలోని సంకీర్ణ సర్కార్‌కు ప్రత్యామ్నాయంగా సమర్థ పాలన అందిస్తానని భరోసా ఇచ్చారు.ప్రజలు ఆయన్ని ఆమోదించారు. ఇదలా ఉంచుదాం. అన్నా హజారే సృష్టించిన అవినీతి వ్యతిరేక ప్రభంజనంలో వామపక్షాలు, మితవాద వర్గాలకు చెందినవారు ఏకమయ్యారు. యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్‌లు బాబా రామ్‌దేవ్, శ్రీశ్రీ రవిశంకర్‌తో కలిసి అవినీతి వ్యతిరేక పోరులో పాల్గొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ లాంటి సమాచార హక్కు కార్యకర్తకు ఆరెస్సెస్ కార్యకర్తలు పూర్తి మద్దతు ఇచ్చారు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే అన్నా ఉద్యమం పట్టణ మధ్యతరగతి ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. వారి మద్దతును సంపూర్ణంగా పొందింది. మార్పును ప్రజలు ఆకాంక్షించారు, స్వప్నించారు. వారి మనో సంకల్పానికి అన్నా ఉద్యమం ఒక వేగాన్ని ఉద్వేగాన్ని సమకూర్చింది. సరే, అన్నా ఉద్యమం, ఇప్పుడు ఢిల్లీని దిగ్బంధం చేసిన రైతు జనం పోరు మధ్య వ్యత్యాసాలను చూద్దాం. 2011 మహోద్యమానికి మాదిరిగా, నేటి రైతుల పోరాటానికి అన్నా లాంటి నాయకుడు ఎవరూ లేరు. అన్నదాతల ఆగ్రహానికి మూర్తీభవించిన ప్రతినిధి ఎవరూ లేరు. ప్రస్తుత పోరాటంలో భిన్న గళాలు వినిపిస్తున్నాయి. అవి, ప్రధానంగా రైతు సంఘాల నాయకులవే అయినా, మోదీ సర్కార్ విధానాలతో విభేదిస్తున్న వివిధ వర్గాలూ తమ నిరసనను నినదిస్తున్నాయి. అత్యధికులు పంజాబ్ నుంచి వచ్చినవారే అయినా ఇతర ఉత్తరాది రాష్ట్రాల వారూ అనేక మంది ఈ పోరాటంలో సంపూర్ణంగా భాగస్వాములు అవుతున్నారు. 2011 ఉద్యమం అన్నాహజారే వెర్సస్ మన్మోహన్ సర్కార్ సంఘర్షణ కాగా, నడుస్తున్న నిరసనలు 'విపక్షాలు వెర్సస్ నరేంద్ర మోదీ' కొట్లాట రూపును సంతరించుకున్నాయి. రైతుల ఆర్తనాదాలు ఈ సంకీర్ణ సమరానికి ఒక నైతిక భూమికను కల్పించాయి. అయితే నాటి, నేటి ఉద్యమాల మధ్య ఒక కీలక వ్యత్యాసం ఉంది. అది మధ్యతరగతి ప్రజల మద్దతుకు సంబంధించినది. నేటి రైతుల పోరాటాన్ని మధ్యతరగతి ప్రజలు బలపరుస్తున్నారనేందుకు ఇంతవరకు స్పష్టమైన దాఖలాలు లేవు. నాడు అన్నా ఉద్యమం ప్రజ్వరిల్లిన వెన్వెంటనే మధ్యతరగతి మందహాసం చేసింది. అవినీతికి వ్యతిరేకంగా నినదించింది. అన్నా ఉద్యమంలో సంపూర్ణ భాగస్వామి అయింది. కారణమేమిటి? 2జి, బొగ్గు, కామన్వెల్త్ క్రీడోత్సవాలు... ఇంకా ఎన్నో కుంభకోణాలు. హతాశులైన మధ్యతరగతి ప్రజలు అన్నా ఉద్యమంలో పాల్గొని తమ ఆగ్రహాన్ని, అసంతృప్తిని వెళ్ళగక్కారు. రాజకీయుల పట్ల తమ తూష్ణీం భావాన్ని అధికారంలో ఉన్నవారూ, అధికారానికి ఆరాటపడుతున్నవారూ అదిరిపోయేలా ప్రకటించారు. ఇప్పుడు అటువంటి తిరస్కార వైఖరి కొరవడింది. పట్టణ మధ్యతరగతి ప్రజలు 'స్వేచ్ఛా విపణి సంస్కరణల' మోజులో మునిగిపోయి ఉన్నారు కదా. మార్కెట్ పోటీలో రైతుకు భద్రతా భరోసా ఉండాల్సిన అవసరాన్ని వారు గుర్తించలేదు. గుర్తించ నిరాకరిస్తున్నారు కూడా. ప్రజా ప్రతిఘటనకు ఒక స్పష్టమైన శత్రువు అవసరం. అవినీతి బాగోతాలతో కళంకితులు అయిన కేంద్ర మంత్రులను శత్రువులుగా నాటి అన్నా ఉద్యమం పరిగణించింది. వారిని తూర్పారపట్టింది. సామాన్యులు సంతోషించారు. ఇప్పుడు రగులుతోన్న రైతుల ఉద్యమానికి తక్షణ శత్రువు అంటూ ఎవరూ లేరు. కేవలం ఒక చట్టాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో అది సాగుతోంది. అదానీ, అంబానీ మొదలైన కార్పొరేట్ కుబేరులకు వ్యతిరేకంగా ఆగ్రహావేశాలను రెచ్చగొట్టేందుకు రైతు సంఘాల నాయకులు ప్రయత్నిస్తున్నారు. అయితే పాలకుల ఆశ్రిత పక్షపాతంపై ఆరోపణలు ప్రజల్లో ఎంత మేరకు కదలికను సృష్టిస్తాయన్నది సందేహమే. ఇప్పుడు ఈ ఉద్యమంలో పాలుపంచుకుంటున్న పలు ప్రతిపక్షాలు తాము అధికారంలో ఉన్నప్పుడు ఆ వ్యాపార దిగ్గజాలకు అనుకూలంగా వ్యవహరించాయి. మరి ఇప్పుడు కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా అవి అనుసరిస్తున్న వైఖరికి విశ్వసనీయత ఎలా ఉంటుంది? అన్నా ఉద్యమం, అన్నదాత పోరు మధ్య మరో ముఖ్యమైన తేడా ఉన్నది. 2011 నిరసనోద్యమంలో మీడియా చురుగ్గా పాల్గొంది. ప్రభుత్వ వ్యతిరేక కథనాలు వెలువరించడంలోనూ,



టీమ్ అన్నా నేతలను జాతీయ నాయకులుగా పైకి ఎత్తడంలోనూ మీడియా కీలక పాత్ర వహించింది. మరి ఇప్పుడో? మోదీ సర్కార్ విధేయ మీడియా ప్రజాపక్షం ఎలా వహిస్తుంది? రైతుల ఆందోళనకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేస్తున్న వాదనలను సవాల్ చేయడానికి బదులు ప్రతిపక్షాలను నిత్యం ఇరకాటంలోకి నెడుతోంది. కేంద్ర మంత్రులు పలువురు రైతులను తప్పుపడుతూ పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రైమ్ టైమ్ ప్రసారాలకు ఎజెండాను నిర్దేశించే అవకాశం ప్రతిపక్షాలకు లేకుండా చేయడమే మోదీ అమాత్యుల లక్ష్యంగా ఉంది మరి. నాటి, నేటి నిరసనోద్యమాలకు మధ్య మౌలిక తేడా మోదీ, మన్మోహన్‌ల వ్యక్తిత్వాల్లోనే ఉందని చెప్పవచ్చు. సంకీర్ణ ప్రభుత్వ, రాజకీయాల పరిమితులు మన్మోహన్‌ను కట్టడి చేశాయి. పాలనాపరంగా ఆయన్ని బలహీనపరిచాయి. మోదీ కటువుగా మాట్లాడతారు. నిరంకుశంగా వ్యవహరిస్తారు. అందునా సొంత పార్టీ సంఖ్యా బలంతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు కదా. మరి భిన్నాభిప్రాయాలను ఆయన ఎలా సహిస్తారు? తిరుగులేని అధినాయకుడుగా తన నిర్ణయాలు, చర్యలు సక్రమమైనవని మోదీ ప్రగాఢంగా విశ్వసిస్తారు. అయితే మట్టిమనుషులు ఇప్పుడు ఢిల్లీకి వచ్చి ఆయన తీసుకొచ్చిన చట్టాల సహేతుకతను ప్రశ్నిస్తున్నారు, సవాల్ చేస్తున్నారు. అవినీతి నిరోధక లోక్‌పాల్ బిల్లుపై సమగ్ర చర్చకు ఒక కమిటీని నియమించడం ద్వారా మన్మోహన్ ప్రభుత్వం అన్నా ఉద్యమాన్ని న్యాయసమ్మతం చేసింది. మోదీ ప్రభుత్వం ఆందోళన చేస్తున్న రైతులలో చీలికలు సృష్టించడానికి ప్రయత్నిస్తోంది. రైతులు దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తోంది. 'అర్బన్ మావోయిస్టుల'కు చెందిన 'తుక్డే తుక్డే గ్యాంగ్' రైతుల ఆందోళనలోకి చొరబడి ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నాలు చేస్తుందని కొంతమంది కేంద్రమంత్రులు ఆరోపిస్తున్నారు. ప్రత్యర్థులను అవమానపరచడం మోదీ ప్రచార యంత్రాంగం ప్రధాన వ్యూహాలలో ఒకటి.రైతు ఆందోళనకారులు 'జాతి-వ్యతిరేక' కుట్రలకు పాల్పడుతున్నారని మోదీ సర్కార్ ఘోషిస్తోంది. ఏ ప్రాతిపదికన? 'కె' పదాన్ని ప్రయోగిస్తోంది. 'కె' అంటే కిసాన్ కాదు, ఖలిస్థాన్! వ్యవసాయ సంస్కరణలను వ్యతిరేకించడం ద్వారా భారత రాజ్యవ్యవస్థను బలహీనపరిచేందుకు నిరసనకారులు ప్రయత్నిస్తున్నారనేది ఆరోపణ. వారు నిజానికి కిసాన్ కారని, ఖలిస్థాన్ వేర్పాటువాదులు అని పాలకులు అంటున్నారు. ఢిల్లీని దిగ్బంధం చేసినవారు పాకిస్థాన్, చైనా ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారనే అసహ్యకరమైన ఆరోపణ చేయడానికి కూడా కేంద్రమంత్రి ఒకరు వెనుకాడలేదు. ఏమైనా మోదీ ప్రభుత్వం చర్చలకు వచ్చేలా చేయడం ద్వారా రైతులు తమ తొలి విజయాన్ని సాధించారు. అయితే కొత్త సాగు చట్టాలను ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌ను అంగీకరించే ప్రసక్తే లేదనంటున్న ఢిల్లీ పాలకులు రైతుల ఉద్యమానికి తలొగ్గుతారని భావించడం శుద్ధ పొరపాటే అవుతుంది. ధర్నా చేస్తున్న రైతుల వద్దకు మోదీ తన మంత్రులను పంపడమనేది జరగని పని (అన్నా ఉద్యమ సమయంలో బాబా రామ్‌దేవ్‌కు ఆనాటి కేంద్ర మంత్రులు ఎర్ర తివాచీ పరిచి స్వాగతం చెప్పిన ఉదంతాన్ని గుర్తుచేసుకోండి). కొత్త వ్యవసాయ చట్టాలపై రైతుల అసంతృప్తి అంత తేలిగ్గా తొలగిపోదు. మోదీ ప్రభుత్వం దిగిరాదు. ఈ రాజకీయ శీత ఋుతువు ప్రస్తుత ప్రాకృతిక చలికాలం అనంతరం కూడా కొనసాగే అవకాశం ఎంతైనా ఉంది.

## అడకత్తెరలో మోదీ

ప్రధాని మోదీ ఇప్పుడు ఏం చేస్తే ఏం జరుగుతుందనేది కీలకంగా మారింది. అన్నదాతల డిమాండ్లు ఆమోదిస్తే కార్పొరేట్ ఎజెండా ఓడిపోతుంది. రైతుల కోర్కెలు అంగీకరించకపోతే, ఉద్యమం ఉధృతమై కార్పొరేట్ వ్యతిరేక ఆర్థిక ఎజెండా ముఖ్య రాజకీయ ఎజెండాగా మారిపోతుంది. మోదీ అధికారానికే కాలం చెల్లే పరిస్థితి వస్తుంది.రాజధాని ఢిల్లీ కేంద్రంగా గత మూడు వారాలుగా సాగుతున్న 'రైతాంగ ఉద్యమం' ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి 'వెనక గొయ్యి.. ముందు నుయ్యి'గా మారుతోంది. అందుకే ఉద్యమం ఎంత ఉధృతంగా సాగుతున్నా, వ్యవసాయ చట్టాలను రద్దు చేసేదాకా వెనక్కు తగ్గేది లేదని అన్నదాతలు తెగేసి చెబుతున్నా, తెచ్చిన చట్టాలకు ఏవైనా 'కొన్ని' సవరణలు చేస్తాము తప్ప వాటిని మొత్తంగా రద్దు చేసే సమస్యేలేదని ప్రభుత్వం మొండి పట్టుదలకు పోతున్నది. చర్చలు జరుగుతుండగానే ప్రధాన మంత్రి ఈ చట్టాల విశిష్టత గురించి ప్రచారం చేయడాన్ని బట్టి వాటిని రద్దుచేసే ఉద్దేశమేదీ ప్రభుత్వానికి లేదని స్పష్టమౌతున్నది. మరోవైపు రైతులను వివిధ రాజకీయ శక్తులు రెచ్చగొడుతున్నాయని శాపనార్థాలు పెడుతున్నారు. ఉద్యమంలో చీలికలు తెచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు.ప్రధాని మోదీ ఆరోపిస్తున్నట్లుగా ప్రస్తుత రైతు ఉద్యమం రాజకీయ ప్రేరేపితం కాదు. వ్యవసాయ రంగాన్ని అస్తవ్యస్తంజేసే అప్రజాస్వామిక చట్టాలను ఆయన తీసుకొచ్చిన తీరే రైతులను ఉద్యమాలకు ఉసిగొల్పింది. అంతేగాక ఈ ఉద్యమం రాజకీయాలపైనే బలమైన ప్రభావం చూపుతోంది. ఇప్పటివరకూ బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు పథకం ప్రకారం ముందుకు తెచ్చిన మతోన్మాద, జాతీయోన్మాద ఎజెండాను వెనక్కు నెట్టి, ఆర్థిక ఎజెండా తిరిగి ముందుకు వచ్చే ప్రక్రియ జోరందుకుంటున్నది. ప్రజల నిత్యజీవిత సమస్యలైన ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, ఉద్యోగాలు, భూమి, వేతనాలు, సంక్షేమం, విద్యా, వైద్యం, గృహవసతి, సామాజిక న్యాయం వగైరాలే గత వందేళ్లకు పైగా మన దేశ రాజకీయాల్లో ప్రధాన ఎజెండాగా ఉన్నాయి. దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ వీటి చుట్టూనే తమ వాగ్దానాలు, కార్యాచరణలూ నడిపాయి. కానీ ఆర్ఎస్ఎస్ ప్రోద్బలంతో భారతీయ జనతా పార్టీ రాజకీయాల ఫోకస్‌ను ఈ ఎజెండా నుంచి తప్పించి, హిందూత్వ ఎజెండాను ముందుకు తేగలిగింది. అదే దాని విజయ రహస్యం.రాజకీయ ఎజెండాను పూర్తిగా మార్చివేసే బిజెపి ప్రయత్నాలకు మన దేశ కార్పొరేట్ శక్తుల అండ కూడా పుష్కలంగా లభించింది. 1990ల నుంచి అమలు జరుగుతున్న ఆర్థిక సంస్కరణలతో పెరిగిన అసమానతలు, పేదరికం వల్ల ప్రజల్లో అసంతృప్తి, ఆగ్రహాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఆగ్రహం నుంచి ఐక్య ఉద్యమాలు ఆవిర్భవించకుండా ఉండాలంటే ప్రజల మధ్య చీలికలు, ఘర్షణలు అవసరం అనేది కార్పొరేట్ ఎజెండాగా ఉంది. ఈ దేశంలో హిందూత్వ రాజ్యం నెలకొల్పాలనే బిజెపి సంకల్పం ఈ ఎజెండాకు అతికినట్టుగా సరిపోయింది. కాబట్టే మన కాషాయ పాలకులకు, కార్పొరేట్ శక్తులకు బలమైన 'ఫెవికాల్' బంధం ఏర్పడింది. హిందూత్వ ఎజెండా బిజెపి వేగవంతమైన రాజకీయ పెరుగుదలకు కూడా బాగా తోడ్పడింది. అయితే రైతుల, కార్మికుల పోరాటాలతో నిత్యజీవిత సమస్యల ఎజెండాకు ఊపిరొచ్చింది. అవి ప్రధాన ఎజెండాగా రాజకీయాల్లో ముందుకు రావటం ప్రారంభమైంది.కాబట్టి ఇపుడు మోదీ ఏం చేయాలనేదీ, ఏం చేయబోతున్నాడనేదీ, ఏం చేస్తే ఏం జరుగుతుందనేదీ కీలకంగా మారింది. రైతు ఉద్యమం ఐక్యంగా, బలంగా ఉంది కాబట్టి, ఇప్పటివరకూ రైతు సంక్షేమమే మా లక్ష్యం అంటూ గొప్పలుపోయారు కాబట్టి వారి కోర్కెలు ఆమోదిస్తే కార్పొరేట్ ఎజెండా ఓడిపోతుంది. అదే జరిగితే ఈ చట్టాలే కాకుండా భవిష్యత్తులో మొత్తం ఆర్థిక సంస్కరణలే ఆగిపోతాయనే భయం. దాంతోపాటు మోదీ స్ట్రాంగ్ మాన్ ఇమేజీ పడిపోతుంది. మరోవైపు రైతుల కోర్కెలు అంగీకరించకపోతే, ఉద్యమం ఉధృతమై ఇతర వర్గాల ప్రజలు ముఖ్యంగా కార్మికులు దీర్ఘకాల పోరాటాలకు సిద్ధమైతే, హిందూత్వ ఎజెండా పక్కకుపోయి, కార్పొరేట్ వ్యతిరేక ఆర్థిక ఎజెండా ముఖ్యమైన రాజకీయ ఎజెండాగా మారిపోతే మోదీ రాజకీయాధికారానికి కాలం చెల్లే పరిస్థితి వస్తుంది.వెనక గొయ్యి... ముందు నుయ్యి లాంటి ఈ ఇరకాటంలోంచి బయటపడేందుకే నిందలు వేసైనా, కుట్రలు చేసైనా ఈ ఉద్యమాన్ని నీరుగార్చాలని, చీలికలు సృష్టించాలని మోదీ, ఆయన అనుయాయులు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో మోదీ జయాపజయాలు రైతాంగం ప్రదర్శించే ఐక్యతపైనా, ఆ ఉద్యమానికి ఇతర ప్రజలు క్రియాశీలంగా ఇచ్చే మద్దతుపైనా ఆధారపడి ఉంటాయి. మోదీ ప్రభృతుల ప్రయత్నాలను నిలవరించటం మన దేశ ఆహార భద్రతనూ, అన్నదాతలనూ ఆదుకోవాలనుకునే దేశభక్తులందరి కర్తవ్యంగా భావించాలి.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

పాలేరు కూసుమంచి డిసెంబర్ 18 ప్రజాపాలన :ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంతెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డకు పెదన్నలా సిఎం కెసిఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీముభారక్ పదకం ద్వారా పెళ్లి కానుక అందజేస్తున్నారని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు శుక్రవారం కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 83 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ఆడబిడ్డల పెండ్లికి కట్నంగా సీఎం కెసిఆర్ పెద్దగా కళ్యాణ లక్ష్మి, షాదీముభారక్, సిఎం ఆర్ చెక్కులు అందజేసి పేదోళ్ల కష్టాలల్లో పాలుపంచుకుంటున్నారని చెప్పారు. అలాగే సీఎం కెసిఆర్ ఆలోచనతో రాష్ట్రం బంగారు తెలంగాణగా మారుస్తున్నారని అన్నారు. ఆడబిడ్డ తల్లి, తండ్రులకు భారంకాకూడదనే ఉద్దేశంతోనే ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలతో రాష్ట్రం అగాదంలోకి నెట్టబడిందని ఆరోపించారు . తెలంగాణ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామం అభివృద్ధి పదంలో పయువిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రాబివృద్దే ధ్యేయంగా కెసిఆర్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమంలో



నేలకొండపల్లి ఎంపీపీ వజ్జా రమ్య జెడ్పి వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, డిసిసిబి డైరక్టర్ ఇంటూరి శేఖర్, , , టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య, చాట్ల పరుశురాం నాయకులు నెల్లూరి లీలా ప్రసాద్,మరికంటి రేణు బాబు, తదితరులు పాల్గన్నారు

## ముందుచూపుతో గణనీయమైన దిగుబడి సాధిస్తున్నాం - ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల, డిసెంబర్ 18 (ప్రజాపాలన):జగిత్యాల రూరల్ మండల్ పోరండ్ల గ్రామంలో జాతీయ ఆహార భద్రత పథకం (పప్పు దినుసులు) లో భాగంగా జగిత్యాల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కంది పంట సాగుకు అవసరమైన పురుగు మందులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత పంపిణీ చేసి కంది ఆవాలు పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఒకప్పుడు అంతర పంటగా ఉంటే పప్పుదినుసులు కందిపంటను నేడు కాలనుగుణంగా ఎకరాల కొద్ది పండిస్తున్నామని రైతాంగానికి ఇబ్బంది లేకుండ ప్రతి 5 వేల ఎకరానికి ఒక వ్యవసాయ అధికారిని రాష్ట్రప్రభుత్వం నియమించిందని అన్నారు. రైతులు రైతుకూలీలు ప్రతి ఒక్కరు ఆర్థికంగా బలపడాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతాంగం క్షేమం కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పాక సురేష్ ఎంపీపీ గాజర్ల గంగారాం గౌడ్ ప్యాక్స్ చైర్మన్ లు మహిపాల్ రెడ్డి సందీప్ రావు రైతుబంధు మండల కన్వీనర్ రవీందర్ రెడ్డి ఆత్మ చైర్మన్ రాజిరెడ్డి సర్పంచులు భూపతి రెడ్డి సుధాకర్ సంధ్యారాణి ఎంపీటీసీ సౌజన్య ఏఈఓ అశ్విని గంగారెడ్డి రాజన్న రవి తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మత పెద్ద మొహమ్మద్ యూనిస్ మియా అస్తమయం



భద్రాద్రి కొత్తగూడెం చంద్రుగొండ ప్రజాపాలన డిసెంబర్ 18: చంద్రుగొండ మండల కేంద్రానికి చెందిన మొహమ్మద్ యూనిస్ మియా స్వర్గస్తులయ్యారు. ఈయన చంద్రుగొండ గ్రామంలో అందరికీ సుపరిచితులు. స్థానిక మసీదులో 12 సంవత్సరాలు పాటు అజ్జహ్ ఇస్తూ, మసీదులో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎనలేని కృషి చేసారని మొహమ్మద్ యూనిస్ మియా మృతి తీరనిలోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని స్థానిక ముస్లిం సోదరులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.. యూనిస్ మియా అంతిమ సంస్కారంలో ఆయన కుమారుడు జాకీర్, మనవడు యాకుబ్ పాషా, సాజిత్ పాషా, గౌస్, మహిముద్, కలిల్, తన్విర్ తోపాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## సుజాతనగర్ మండలంలో కొత్తగూడెం శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు

భద్రాద్రికొత్తగూడెం ప్రజా పాలన :మండలం లో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు మండల పరిధిలో సింగభూపాలెం చెరువులో రొయ్య పిల్లల ను వదిలారు ఈసందర్భంగా మాట్లాడిన వనమా ఇంత పెద్ద కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుంటే పదమూడు మంది సభ్యులు రావడం విచిత్రంగా ఉంది అన్నారు.తెలంగాణ ప్రభుత్వం చేతి వృత్తి వారికి పెద్దపీట వేసింది అని సింగభూపాలెం చెరువులో చేప పిల్లలు రొయ్యలు ప్రభుత్వం ఇచ్చి వారికి తోడ్పాటును ఇస్తుంటే సంఘము సభ్యులకు అర్థం కావటంలేదని ఆవేదనను వ్యక్తం చేశారు అలాగే పాత అంజనాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ధాన్యం కొనుగోలు



కేంద్రాన్ని ప్రారంభించారు తరువాత సుజాతనగర్ చర్చి లో జరిగిన ప్రభుత్వం నిరుపేద క్రైస్తవులకు బట్టలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా ఉంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో టి అర్ ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్రరావు గ్రంధాలయం చేర్మెన్ కంచర్ల చంద్రశేఖర్ రావు జెడ్ పి టి సి బిందు చోహన్ ఎమ్ పి పి విజయలక్ష్మి సర్పంచ్ లు ఎమ్ పి టి సి లు మోహనరావు మండే వీర హనుమంతరావు ట్ ఆర్ ఎస్ నాయకులు లింగం పిచ్చిరెడ్డి లావుడియా సత్యనారాయ ణ తదితరులు పాల్గొన్నారు

## విశ్వాసంతో వచ్చిన ప్రతి ఒక్కరికి పార్టీ పుష్కలంగా అండదండలు



బాలాపూర్ : ప్రజాపాలన : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ మరియు బిజెపి నేతల సమక్షంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు వరికుప్పల వెంకటేష్ టిఆర్ఎస్ పార్టీ కి రాజీనామా చేసి, బిజెపి పార్టీలో చేరారు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ వారికి బిజెపి పార్టీ కండువా కప్పి భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానించారు. వరికుప్పల వెంకటేష్ మాట్లాడుతూ.... టిఆర్ఎస్ పార్టీలో ఏలాంటి గౌరవం మర్యాద లేదు.... అదేవిధంగా చెప్పిన పనులు చేయటం లేదు అని బిజెపిలో నియమ నిబంధనలు నచ్చి పార్టీలోకి చేరాను అన్నారు. బిజెపి నేతలు పార్టీ గురించి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని విశ్వాసం కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ఎల్లవేళలా అండదండలతో పాటు మీ వెనక ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి , బిజెపి జిల్లా నాయకులు టేకుల భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శివారెడ్డి, ప్రధానకార్యదర్శి దొడ్డి మల్లికార్జున్, తిరుపతి, సంతోష్ ముదిరాజ్, పోరెడ్డి జగన్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ విద్యార్థి సురేష్ యాదవ్ పై దాడిని ఖండించిన యువజన కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ జేర్రిపోతుల అంజని



పాలేరు కూసుమంచి డిసెంబర్ 18 ప్రజాపాలన :ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంఓయూ విద్యార్థి సురేష్ యాదవ్ పై టీఆర్ఎస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిన్తున్నాము. ఉద్యోగాల గురించి ప్రశ్నిస్తే దాడి చేస్తారా ఖబడ్దార్ కెసిఆర్ విద్యార్థి లోకం నీ నియంత పాలనను వచ్చే ఎన్నికలలో విద్యార్థులు నిరుద్యోగులు రాబోయే రోజుల్లో టిఆర్ఎస్ బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయి నిరుద్యోగ యువతకు 3016 లో వెంటనే వేయాలి. త్వరలో %మీాజ% ఎన్నికల నేపథ్యంలో50 వేల ఉద్యోగాల భర్తీ కాదు. రాష్ట్రంలో 45 ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న 2.50 లక్షలు ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాల్సిందే.యువజన కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ జేర్రిపోతుల అంజని.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో పెద్దపులి ఆనవాళ్లు ఆందోళనలో గ్రామస్తులు

భద్రాద్రికొత్తగూడెం, ప్రజాపాలన డిసెంబర్18 : కొత్తగూడెం డివిజన్ రామవరం రేంజ్ పరిధిలోని అబ్బుగూడెం బీట్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లుగా అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలు గుర్తించినట్లుగా ఫారెస్ట్ డివిజనల్ అధికారి ఏ అప్పయ్య, రేంజ్ ఆఫీసర్ ఉమా ఆదేశాల మేరకు శుక్రవారం విలేకరుల సమావేశంలో అబ్బుగూడెం డి.ఆర్.ఓ బి. రామకృష్ణ వెల్లడించారు. గ్రామంలోని ప్రజలు ఎవరు భయ బ్రాంతులకు గురికావద్దని అన్నారు. వారం పదిరోజుల వరకు అటవీ ప్రాంతంలోకి ఎవరు రాకూడదని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వస్తే గుంపుల గానే రావాలని సూచించారు. పశువుల కాపరులు పశువులను దట్టమైన అటవీ ప్రాంతాల వైపు మేతకు తీసుకెళ్లారాదని వ్రైదాన ప్రాంతాలలోనే పశువులను మేతకు



తీసుకెళ్లాలని. అటవి ప్రాంతంలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని వేటగాళ్లు ఉచ్చులను, కరెంటు లాంటివి ఏర్పాటు చేయకుండా స్థానిక వేటగాళ్లకు ఇప్పటికే అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. ఎవరైనా ఉచ్చులు ఏర్పాటు చేస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద శిక్షార్హులు అవుతారని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే పెద్దపులి ఎవరికైనా కనిపించినట్లయితే వెంటనే ఫారెస్ట్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అబ్బుగూడెం డి. ఆర్.ఓ బి.రామకృష్ణ ,బీట్ ఆఫీసర్లు జి. నాగేశ్వరరావు , గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న రాములు నాయక్



భద్రాద్రికొత్తగూడెం జిల్లా ప్రజాపాలన : జూలూరుపాడు మండలం ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయం నందు ప్రియతమ నేత గౌరవనీయులు వైరా శాసనసభ్యులు శ్రీ లావుడియా రాములు నాయక్ నేటికి శాసనసభ్యులుగా బాధ్యతలు చేపట్టి దిగ్విజయంగా రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం మండల అధ్యక్షుడు చౌడం నరసింహారావు ఆధ్వర్యంలో జరిగినది. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకట్ రెడ్డి , ఎంపీపీ లావుడియా సోనీ , టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు పోతురాజు నాగరాజు , వెంకన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరు మధుసూదన రావు , సొసైటీ డైరెక్టర్ లకవత్ హేమ్లా, %ూవీజ% డైరెక్టర్ హాలవాత్ నరసింహారావు , %ూవీజ% డైరెక్టర్ సపవత్ నరేష్ , మైనార్టీ సెల్ నాయకులు ఎస్ కె మహబూబ్ , సీనియర్ నాయకులు రామిశెట్టి నాగేశ్వరావు , బానోత్ ధర్మ , భానోత్ చిన్న , హత్తి రామ్ , మోదుగు రామకృష్ణ , నాయకులు బోడ నాగరాజు , మాడుగుల నాగరాజు, మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు హాజరయ్యారు.

# ఆలంపల్లిలో అయ్యప్ప స్వామి పూజ

వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 18 ( ప్రజాపాలన ) : మహిషాసురుని సంహరించినందుకు దేవతలపై పగ సాధించాలని అతని సోదరి మహిషి అనే రాక్షసి బ్రహ్మ గురించి ఘోర తపస్సు చేసింది. బ్రహ్మ ప్రత్యక్షమయిన తరువాత మహిషి బ్రహ్మను ఈ విదంగా కోరింది. శివుడికి కేశవుడికి పుట్టిన సంతానం తప్ప నన్నెవరూ జయించకూడదు అని వరం కోరింది. అది కూడా ఆ హరిహర తనయుడు పన్నెండేళ్ళ పాటు భూలోకంలోని ఒక రాజు వద్ద సేవా ధర్మం నిర్వర్తించాలి. అలా కానిపక్షంలో అతడు కూడా నా ముందు ఓడిపోవాలి అని వరం కోరింది మహిషి. తథాస్తు అని మహిషికి వరాన్ని ప్రసాదించాడు బ్రహ్మదేవుడు. చైత్ర మాసము ఉత్తరా నక్షత్రము చతుర్దశి సోమవారం నాడు అయ్యప్ప జన్మించాడు. జ్యోతి రూపంగా అంతర్ధానం అయిన రోజు మకర సంక్రాంతి. క్షీరసాగరమధనం అనంతరం దేవతలకు రాక్షసులకు అమృతం పంచేందుకు విష్ణువు మోహినిగా అవతారం ధరించి కార్యం నిర్వహిస్తాడు. అదే రూపములో విహరిస్తున్న మోహినిని చూసి శివుడు ఆమె పట్ల ఆకర్షింపబడతాడు వారి కలయికతో శివకేశవుల తేజస్సుతో ధనుర్మాసం 30 వ రోజు శనివారం పంచమి తిథి ఉత్తర నక్షత్రము వృశ్చికా లగ్నమందు శాస్త ( అయ్యప్ప ) జన్మించాడు.ఇతడు శైవులకు వైష్ణవులకు ఆరాధ్య దైవం. తండ్రియైన జగత్పతి ఆజ్ఞ ప్రకారం పంపా సరోవర మెడలో మణిమాలతో శిశురూపంలో అవతరించాడు ధర్మశాస్త. అయ్యప్ప స్వామి ధర్మ ప్రవర్తన, ధర్మనిష్ఠ లోకానికి ఆశ్చర్యాన్ని కలిగించింది. తన భక్తులకు ఏ ధర్మాలు, ఏ నియమాలు పాటించాలో కొన్ని



మార్గదర్శక సూత్రాలను నిర్దేశించాడు. అప్పటి నుండి అయ్యప్ప ధర్మ శాస్తగా ప్రఖ్యాతిగాంచాడు. వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో అయ్యప్ప స్వామి పడి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెయ్యి తేనే పాలు పెరుగు పండ్లతో స్వామికి అభిషేకాలు నిర్వహించి 18 మెట్లపై జ్యోతులు వెలిగించి అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. స్వాములు పెద్ద ఎత్తున పాల్గొని అయ్యప్ప స్వామికి ఇష్టమైన పేట తుళ్ళీ ఆడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజ నిర్వాహకులు బోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు బోరెడ్డి భూపతి రెడ్డి కన్నెస్వామి పూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వాములు యాదయ్య నరసింహులు గౌడ్ హనుమంతు వీరప్పన్ వెంకట్ రమణ నాగరాజు గౌడ్ రవి భజన మండలి రవి శర్మ ప్రదీప్ బాల్ రెడ్డి అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం



వలిగొండ ప్రజాపాలన : మండలంలోని మల్లెపెల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లెపెల్లి గ్రామానికి చెందిన పల్లెర్ల అనూష(24)బుధవారం వేకువజామున కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటి నుండి వెళ్ళిపోయింది.కుటుంబ సభ్యులు యువతి ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల ఇళ్లల్లో వెతికారు.ఆచూకీ తెలియకపోవడంతో యువతి తండ్రి పల్లెర్ల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ ఐ రాఘవేందర్ గౌడ్ శుక్రవారం తెలిపారు.

# సర్వమత సమానత్వమే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 18 (ప్రజాపాలన) : సర్వమత సమానత్వమే ప్రభుత్వ లక్ష్యమని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో క్రైస్తవ ఆడపడుచులకు క్రిస్మస్ కానుకగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలను సమాదరంగా గౌరవిస్తున్నదని గుర్తు చేశారు. కులాలకు మతాలకు అతీతంగా సంస్కృతీ సాంప్రదాయాలు తుచ తప్పకుండా ఆదరిస్తుందని అన్నారు. నిరు పేద కుటుంబాలు కూడా ప్రతి పండుగను ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో జరుపుకోవడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నామని వివరించారు. రాబోవు క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు సోదరీమణులు ఆనందంగా జరుపుకోవాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను అన్నారు. ప్రజల సంక్షేమం కొరకు అహర్నిశలు కృషి చేస్తుందని పేర్కొన్నారు. పండుగల కొరకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించి హిందువులకు బతుకమ్మ చీరలు, క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు, ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. క్రిస్మస్ కానుకలతో నిరుపేద క్రైస్తవ కుటుంబాల్లో సంతోషం వెల్లివిరియాలని కోరారు. క్రైస్తవ సోదర సోదరిమణులందరికీ క్రిస్మస్ పండగ ముందస్తు శుభాకాంక్షలు తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, ఎంపిపి కామిడి చంద్రకళ, ఆర్డిఒ ఉపేందర్ రెడ్డి, ఎంఆర్ఓ రవీందర్, నాయబ్ తహశీల్దార్ యాదయ్య, వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, ఏఎంసి చైర్మన్ విజయ్ కుమార్, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ జె.మోనిక, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్లు, సర్పంచులు, పాస్టర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పదేవాలయంలో ప్రత్యేక పూజలు



మధిర, డిసెంబర్ 18, ప్రజాపాలన :శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయం నందు ఉదయాస్తమాన పూజలు మధిర ప్రముఖ వ్యాపారవేత్త కాంగ్రెస్ పార్టీ మెయిన్ లీడర్ మున్సిపాలిటీ 9 10 డివిజన్లకు కౌన్సిలర్స్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ శ్రీ మల్లాది వాసు సబిత గార్ల దంపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు ఈ పూజా కార్యక్రమాన్ని కేరళ సాంప్రదాయ ప్రకారం తాంత్రిక పూజ తో శ్రీ శబరి దినేష్ గారిచే ఉదయం ఐదున్నర గంటలకు గణపతి హెూమం తో మొదలైనది ఏడు గంటలకు సి వేలి పూజా కార్యక్రమం 9 గంటలకు 18 రకాల అభిషేకాలు సాయంత్రం ఎనిమిది గంటలకు సి వేలి పూజా కార్యక్రమం 8 45 నిమిషాలకు శ్రీ స్వామివారి హరిహరాసనం తో ఉదయాస్తమాన పూజ ముగియనున్నది ఈ కార్యక్రమంలో శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయం ట్రస్ట్ సభ్యులు అయ్యప్ప భక్తులు మాలధారులు గురు స్వాములు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకుల పంపిణీ



వలిగొండ ప్రజాపాలన మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన గోగు రాజు కుటుంబ సభ్యులకు స్థానిక 5 వ వార్డు సభ్యులు డొగిపర్తి సంతోష్ గుప్తా,మన టీమ్ సభ్యులు శుక్రవారం నితావసర సరుకులు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ రెడ్డి,నరేందర్ రెడ్డి,మహేష్,ఉదయ్,నరేందర్,బత్తిని బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## సనత్ నగర్ లో నూతన ఐవిఎఫ్ కేంద్రాన్ని ప్రారంభించిన జీవా ఫెర్టిలిటీ





అమీర్‌పేట, డిసెంబర్ 18, ప్రజాపాలన : స్త్రీ , పురుషుల పునరుత్పత్తి సమస్యల పరిష్కారంలో అత్యుత్తమ చికిత్స లను అందిస్తూ పేరెన్నికగన్న జీవా ఫెర్టిలిటీ సంస్థ తమ నూతన ఐవిఎఫ్ కేంద్రాన్ని సనత్ నగర్ లో ప్రారంభించారు . ఈ సందర్బంగా జెక్ కాలనీ లోని రెనోవా నీలిమ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో జీవా ఫెర్టిలిటీ సంస్థ సైంటిఫిక్ డైరెక్టర్ డాక్టర్ చేకూరి సువర్చల,జీవా ఫెర్టిలిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ పెద్దిరెడ్డి లు నూతన కేంద్రంలో అందుబాటులో ఉన్న పలు సేవలను వివరించారు . యురోపియన్ దేశాలనుండి దిగుమతి చేసుకున్న అత్యంత నాణ్యమైన ఖచ్చితమైన ఫలితాలను అందచేయగల ల్యాబరేటరీ ని ఈ కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు . ఈ కేంద్రం ప్రారంభంతో వినూత్నమైన ఎంబ్రియాలజి ఆధారిత ఐ వి ఎఫ్ కేంద్రాల సమూహంగా జీవా ఫెర్టిలిటీ పేరు సంపాదించిందన్నారు . స్త్రీ లకు ట్యూబ్ లలో అడ్డంకి ఉన్నవారు , ఎండోమెట్రియాస్ , పి సి ఓ ఎస్ , ప్రీ మెచ్యూర్ ఒవేరియన్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు ఉన్నవారికి పలు చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు . ఫీజింగ్ ద్వారా క్యాన్సర్ లాంటి చికిత్సను తీసుకోబోయే ముందు వారి అండాలను భద్రపరుకునే సదుపాయం ఈ కేంద్రంలో ఉందన్నారు . పురుషులలో azoospermia వంటి రుగ్మతతో బాధపడే వారికి సేవలను , అవసరమైన మైక్రో ఫ్లూయిడ్స్ ,MACS వంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు . జీవా ఫెర్టిలిటీ కేంద్రాలలో 60 నుండి 70 శాతం వరకు సాఫల్యత సాదిస్తున్నామని తెలిపారు .శ్రీధర్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ జీవా గ్రూప్ ఆఫ్ ఫెర్టిలిటీ సంస్థ 2019 లో నెలకొల్పామని నేడు మరిన్ని కేంద్రాలను స్థాపించే దిశగా అడుగులు వేయడానికి కారణం నాణ్యతతో ,ఆధునికమైన ల్యాబరేటరీ సదుపాయాలు కల్పించడం , సుశిక్షితులైన వైద్యులు , ఇతర సిబ్బంది ఈ విజయానికి కారకులు అన్నారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ రాములు రెడ్డి , డాక్టర్ అలేఖ్య నాయుడు , డాక్టర్ ఐశ్వర్య , డాక్టర్ ఆరాధన లు పాల్గొన్నారు .

## కళ్యాణవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవం



మధిర,డిసెంబర్ 18, ప్రజాపాలన :శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం వర్తక సంఘం మధిర ధనుర్మాస ఉత్సవం లో భాగంగా ఈరోజు శ్రీమతి వసుమర్తి పద్మజ కుమారి గారి చే మూడవ పాశురం గురించి విన్నపము చేయనైనది శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీ స్వామివారికి వెన్నతో( నవనీతం) స్వామివారికి కి అలంకరణ చేయనైనది ఈ అలంకారానికి కైంకర్యం చేసిన దాత గోగులమూడి ద్రోణాచార్య గారు విజయవాడ వాస్తవ్యులు ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకుసాయంత్రం 7 గంటల నుండి 8 గంటల వరకు నిర్వహించబడు ఉపన్యాసంలో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామి వారి మంగళా శాసనాలు పొంది తీర్థ ప్రసాదములు స్వీకరించగలరు.

## న్యూట్రి గార్డెన్ పథకము క్రింద ఇ ఆటోలు

### జిల్లా పాలనాధికారిణి పౌసుమి బసు




వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 18 ( ప్రజాపాలన ) : న్యూట్రి గార్డెన్ పథకము క్రింద ఇ ఆటోలను మహిళా సంఘం సభ్యులకు లోనుపై జిల్లా కలెక్టర్ పౌసుమి బసు అందజేశారు. శుక్రవారం చిట్టంపల్లి డిపిఆర్సి సెంటర్ వద్ద డిఆర్డిఎ ఆధ్వర్యంలో నవాబుపేట, కుల్కచర్ల, మోమిన్పేట మండలాలకు చెందిన మహిళా సంఘం సభ్యులకు ఇ ఆటోలను పంపిణీ జేశారు. ఇట్టి ఆటోల ద్వారా గ్రామంలో కూరగాయలు అమ్ముకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఒ కృష్ణన్, సంబంధిత మండలాల డిపిఎంలు, ఏపిఎంలు, మహిళా సంఘం సభ్యులు, డిఆర్డిఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ భగవాన్ శరణం



మధిర, డిసెంబర్ 18, ప్రజాపాలన : శ్రీ ధ్యాన చక్ర హీలింగ్ పీఠం వ్యవస్థాపకులు శ్రీ మహంకాళి రామకృష్ణ తిలక్ అధ్యక్షతనప్రతి నెల డాక్టర్ వసంతమ్మ గారి సేవానదన్ కి మరియు మాగల్లు లో వృద్ధాశ్రమం నికి బియ్యం 25 కేజీలు చొప్పున 50 కేజీ బియ్యం ప్రతి నెల ఇవ్వడం జరుగుతుంది మరియు ఈ లాక్ డౌన్ సమయం బీహార్ కూలీలకు, వృద్ధులకు ,పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు మరియు బియ్యం ధ్యాన చక్ర హీలింగ్ పీఠం అధ్యక్షులు శ్రీ మహంకాళి రామకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది ఇందులో భాగంగా అధ్యక్షులు ప్రజాక్షేత్రంలో తనదైన శైలిలో సోషల్ రెస్పాన్సిబిలిటీ కలిగి జర్నలిస్టుగా విధులు నిర్వహిస్తున్న స్థానిక నివాసి అయిన కొంగల విజయ్ కుమార్ తండ్రి గారైన దాసు .,గత 8 రోజుల క్రితం దివంగతులైనారు. 9వ రోజు (19-12-2020 ) కార్యక్రమం జ్ఞాపకార్థ కూడిక కు , వారి కుమారుడు విజయ్ గారికి 25 కేజీల బియ్యం, వెయ్యి రూపాయల విలువచేసే నిత్యవసర సరుకులను ధ్యాన చక్ర హీలింగ్ పీఠం అధ్యక్షులు శ్రీ మహంకాళి రామకృష్ణ మరియు వారి సోదరులు సతీష్ కుమార్ అందజేసినారు.

## కంపోస్ట్ షెడ్ ను ప్రారంభించిన జడ్పీ చైర్ పర్సన్ వసంత



జగిత్యాల, డిసెంబర్ 18 (ప్రజాపాలన):జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో తడిపొడి చెత్తను వేరు చేయుటకు నిర్మించిన కంపోస్ట్ షెడ్డును జిల్లా జడ్పీ చైర్పర్సన్ దావ వసంత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండాపూర్ గ్రామంలో ప్రతిఇంటి నుండి సేకరించిన తడిపొడి చెత్తను షెడ్లో వేరుచేసి ఎరువుల తయారీకి కంపోస్టు పిట్ ద్వారా చేయుటకు అవకాశం ఉన్నందున గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన షెడ్లలో క్రమం తప్పకుండ వేరుచేసి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామపంచాయతీ నందు అభివృద్ధి పనులకు వాడుకునే అవకాశం ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి వాటిని అమ్మడం ద్వారా కూడ అదనపు ఆదాయం చేకూరుతుందని ఆదాయాన్ని పెంపొందించుకుని గ్రామంలో పారిశుద్ధ్యం పనులను సమర్థవంతంగా నిర్వహించి అంటువ్యాధులు రాకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం కొండాపూర్ పల్లె ప్రకృతి వనం పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరన్ రావు ఎంపీపీ ఉమ దేవి రాజ రత్నాకర్ రావు జిల్లా పంచాయతీ అధికారి శేకర్ డివిజన్ల పంచాయతీ అధికారి శంకర్ ఎంపిడివో సుష్మా స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్ హరిణి ఏపిఓ కొమురయ్య టిఏ స్వప్న సర్పంచ్ డీ అభిలాష్ ఉప సర్పంచ్ విజయ నరేష్ ఎంపీటీసీ రాజు వార్డ్ మెంబెర్స్ మహిళ సంఘం సభ్యులు అంగన్ వాడి టీచర్లు ఆశలు పాల్గోన్నారు.

## ఐదో రోజు రైతాంగ నిరసన దీక్షలు



భద్రాద్రి కొత్తగూడెం, దమ్మపేట ప్రజాపాలన న్యూస్ : కొత్తగూడెం ధర్నాచౌక్ దమ్మపేట సిపిఐ మండలం సమితి మరియు అశ్వారావుపేట నియోజకవర్గం సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా నాయకులు యార్లగడ్డ భాస్కరరావు మండల కార్యదర్శి తంగెళ్ల ముడి శివ కృష్ణ పండూరి వీరబాబు యండమూరి రత్నకుమారి ఎస్ కే జాను శేషు కుమారి మద్దెల రాములు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ కానుకల పంపిణీకి రానున్న ఎమ్మెల్యే పైళ్ల

వలిగొండ ప్రజాపాలన : నేడు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో క్రిస్మస్ సోదరులకు ప్రభుత్వం తరపున పంపిణీ చేయనున్న క్రిస్మస్ కానుకల పంపిణీకి స్థానిక శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి పాల్గొననున్నట్లు టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దేగల పాండు యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిది చెక్కు పంపిణీ

వలిగొండ ప్రజాపాలన : ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు ఒక వరం లాంటిదని భువనగిరి శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మండలంలోని యం తుర్కపల్లి గ్రామానికి చెందిన ఏనుగు వాసవి ఇటీవల అనారోగ్యానికి గురైన సందర్భముగా ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం మంజూరైన 80 వేల రూపాయల చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి తుమ్మల వెంకట్ రెడ్డి నాయకులు ఎడ్ల నిరంజన్ రెడ్డి,దాసు రావు,వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.




# ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | | | |
|---|---|---|---|---|
| తల్లనారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| డి. వరప్రసాద్ | - | తెల్లాపూర్ | - | 9553999990 |
| గణేష్ | - | బాలాపూర్ | - | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| పి. లక్ష్మీనారాయణ గౌడ్ | - | కొల్చారం | - | 9912532909 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| టి. సురేష్‌చారి | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| అన్వర్ బాషా | - | కుత్బుల్లాపూర్ | - | 7993047109 |
| కళ్యాణ్ సి.ఎం. | - | కూకట్‌పల్లి | - | 7842672389 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |


## అధికారులు రియల్ మాఫీయాను అరికట్టాలి

### సిపిఐ పట్టణ కార్యదర్శి బెజవాడ రవి డిమాండ్



మధిర, డిసెంబర్ 18, ప్రజాపాలన : మధిర మున్సిపాలిటీ పరిధిలో మళ్ళీ రియల్ ఎస్టేట్ మాఫియా ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి వృ ఏంతకు బరితేగించారంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరాద వాటర్ స్కీం పైప్ లైన్ ను కూడా కబ్జా చేసే స్థాయికి వెళ్లారు .అదీ కూడా సాక్షాత్తు మధిర మున్సిపాలిటీ చైర్మేన్ ప్రాతినిధ్యం వహిస్తున్న 4 వ వార్డు ఇల్లందులపాడు కు ఆనుకుని వున్న డబుల్ రోడ్ ఆనుకొని. అలాగే వర్షం వస్తే ఇల్లందులపాడు లోని వర్షపు నీరు రోడ్ కు ఎడమ వైపు కాని కుడివైపున కానీ మొత్తం వర్షపునీరు వెళ్లే కాలువను కూడా ఎదేచ్చగా ఆక్రమించినారు అంటే ఎంతగా బరితేగించారో అర్థం అవుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం స్పందించి తక్షణమే ఆక్రమణలు తొలగించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బెజవాడ రవి డిమాండ్ చేశారు

# అయిదు అపోహలు



జీవితం అంటే పరుగులు తీయడమే అనుకుంటాం. కానీ, ఉన్నట్లుండి ఒక్కోసారి పరుగులు తీసే ఆ కాళ్లకు పగ్గాలు పడతాయి. పరుగుల మాట అటుంచి అసలు కాలు కదపలేని స్థితి కూడా ఏర్పడుతుంది. ఆస్టియో ఆర్థరైటిస్‌లో జరిగేదే అది మరి! కీళ్లల్లో వాపు, నొప్పి, కీళ్లు బిగుసుకుపోవడం వంటి ఆర్థరైటిస్ లక్షణాలు, ఏదో ఒక కీలును గానీ, అనేక కీళ్లను గానీ, తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. అందుకు గల బాహ్య కారణాలు కొన్నయితే, శరీరంలో పేరుకుపోయిన వ్యర్థ, విషపదార్థాలు మరో కారణం. అయితే ఆర్థరైటిస్ విషయంలో చాలా మందిలో అవగాహన ఉన్నా, అపోహలు కూడా ఉన్నాయి. వాటిని అర్థం చేసుకోలేకపోతే ఆ సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉంది. అలాంటి అపోహల్లో కొన్ని:

ఈ సమస్య వృద్ధులకేనా?

నిజమే...!ఆర్థరైటిస్‌తో బాధపడే వాళ్లల్లో అత్యధికులు కాస్త వయసు పైబడిన వాళ్లే. కాకపోతే, వారిలో 60శాతం మంది ఇంకా తమ ఉద్యోగ, వ్యాపారాల్లో కొనసాగుతున్న వాళ్లే. నిజానికి ఆర్థరైటిస్ సమస్యకు పూర్తిస్థాయి చికిత్స ఏదీ లేదు కానీ, తొలిదశలోనే చికిత్సలు తీసుకుంటే వ్యాధి లక్షణాలను, అడ్డుకునే అవకాశాలు ఉన్నాయి. సమస్య మరింత విషమించకుండా నియంత్రించే అవకాశాలూ ఉంటాయి.

పొడివాతావరణమే మేలా?

ఆర్థరైటిస్ బాధితులు వెచ్చని లేదా పొడి వాతావరణంలో ఉన్నప్పుడు కాస్త కీళ్లు బలపడినట్లు, కాస్త ఉపశమనంగా అనిపిస్తుంది. కానీ, ఈ సమస్య దీర్ఘకాలికంగా కొనసాగినప్పుడు ఈ తరహా ఉపశమనాలు కీళ్లు మరింత క్షీణించకుండా ఆపలేవు.

కీళ్లల్లోంచి శబ్దాలొస్తే ప్రమాదమా?

కొంత మంది కీళ్లల్లో అడుగు తీసి అడుగు వేసిన ప్రతిసారీ కటకట మంటూ శబ్దాలు వస్తాయి. అయితే, ఈ శబ్దం సమస్య మరింత తీవ్రమవుతోందని చెప్పే చిహ్నమేమీ కాదు. కీళ్లల్లో ఉండే సైనోవియల్ ఫ్లూయిడ్ మీద పడే ఒత్తిడి అటూ ఇటూ మారడం వల్ల అక్కడుండే నీటి బుడగలు చిట్లడం వల్ల ఈ శబ్దాలు వస్తాయి. ఆ బుడగలు అలా చిట్లడం వల్ల కీళ్లకు కలిగే నష్టం మాత్రం ఏమీ లేదు.

ఎక్స్‌రేలు నిజాలు చెబుతాయా?

నిజానికి, ఎక్స్‌రేలు కీళ్ల లోతుపాతుల్ని పెద్దగా చెప్పలేవు. ఎందుకంటే ఎక్స్‌రేల్లో అంతా నార్మల్ అని వచ్చినా ఆ పేషంట్ తీవ్రమైన కీళ్ల నొప్పులతో బాధపడుతూ ఉండొచ్చు. ఇందుకు విరుద్ధంగా, రిపోర్టులు ఆర్థరైటిస్ సమస్య చాలా తీవ్రంగా ఉందని సూచించినప్పుడు పేషంట్‌కు అసలు నొప్పే తెలియకపోవచ్చు. అందువల్ల కీళ్లు బిగుసుకుపోవడం, నొప్పి, శక్తి హీనత వంటి లక్షణాల ద్వారానే సమస్యను గుర్తించాలి. లేదంటే కొన్ని రక్తపరీక్షల ద్వారా రుమాటాయిడ్ ఆర్థరైటిస్, గౌట్ వంటి సమస్యలు ఉన్నాయేమో తెలుసుకోవచ్చు.

ఆర్థరైటిస్ సమస్య ఉన్నవాళ్లు వ్యాయామం చేస్తే కీళ్లు మరింత దెబ్బ తింటాయనే అపోహ చాలా మందిలో ఉంది. కానీ, వ్యాయామాలు ఆర్థరైటిసను బాగా తగ్గిస్తాయి. పలు పరిశోధనల్లో ఈ నిజం పలుమార్లు వెల్లడయ్యింది. కాకపోతే సాధారణ వ్యాయామాల కన్నా థెరప్యూటిక్ వ్యాయామాల ద్వారా వీరికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందనేది వాస్తవం.

## టొమాటో జ్యూస్‌తో బోన్స్ స్ట్రాంగ్




రోజూ రెండు గ్లాసుల టొమాటో జ్యూస్ తాగితే ఎముకలు బలంగా తయారవ్వడమే కాకుండా అస్టియోపోరోసిస్ దరి చేరకుండా ఉంటుందని పలువురు శాస్త్రవేత్తలు అంటున్నారు. టొమాటోలో ఉండే లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంట్ ఎముకలు దృఢంగా ఉండేలా చేస్తుందని కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ టోరంటోకు చెందిన శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల్లో వెల్లడయింది. 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న అరవై మంది మెనోపాజ్ దశ దాటిన మహిళలపై ఈ పరిశోధనలు నిర్వహించారు. ఇందులో భాగంగా వారి మెనూలో ఒక నెల రోజుల పాటు టొమాటో, టొమాటోతో చేసిన ఇతర పదార్థాలు ఏవీ లేకుండా చేశారు. అప్పుడు వారి రక్తంలో అంటే ఎముక విరిగే సమయంలో విడుదలయ్యే 'ఎన్-టెలోపెప్టైడ్' అనే ఒకరకమైన కెమికల్ లెవల్ పెరగడాన్ని గమనించారు. ఆ తరువాత వారికి వరుసగా నాలుగు నెలలపాటు 15 ఎంజీ లైకోపీన్ ఉన్న టొమాటో జ్యూస్‌ను అందించారు. అప్పుడు మళ్లీ పరిశీలించగా ఎన్-టెలోపెప్టైడ్ లెవెల్స్ చాలా వరకు తగ్గిపోయాయి. దీన్నిబట్టి టొమాటో తినడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అంతేకాకుండా లైకోపీన్ పురుషుల్లో వచ్చే ప్రొస్టేట్ క్యాన్సర్‌ను నివారించడమే కాకుండా గుండె జబ్బుల నుంచి కాపాడుతుందని గతంలో జరిపిన పరిశోధనల్లో వెల్లడయింది. అయితే.. 50 ఏళ్ల పైబడిన వారే కాకుండా.. యుక్త వయసులో ఉన్నవారికి కూడా టొమాటో జ్యూస్ మేలుచేస్తుందట..

## రోజుకో గుడ్డు మంచిదే!



గుండెపోటు, పక్షవాతం వంటి మాటలు వింటేనే చాలా మంది గుండె గుభేల్‌మంటుంది. ఎందుకంటే క్షణాల్లో ప్రాణాలు తీసేది ఒకటైతే, ఎందుకూ పనికి రాకుండా చేసేది మరొకటి. అందుకే వాటి పేరెత్తితేనే అంత భయం. కాకపోతే రోజుకు ఒక గుడ్డు తినడం ద్వారా ఈ రెండు సమస్యలకూ చెక్ పెట్టవచ్చునంటున్నారు పరిశోధకులుగుడ్డు అనగానే 'అమ్మో కొలెస్ట్రాల్' అంటూ చాలామంది వణికిపోతారు. కానీ, శరీర పోషణకు ఒక పరిమిత మోతాదులో మంచి కొలెస్ట్రాల్ కూడా అవసరమేననేది వాస్తవం. కొలెస్ట్రాల్‌తో పాటు గుండె పనితీరుకు తోడ్పడే విటమిన్లు, లవణాలు గుడ్డులో పుష్కలంగా ఉంటాయి. వీటికితోడు జీవక్రియలకు అవసరమయ్యే ప్రొటీన్‌తో పాటు, 9 రకాల అమినో యాసిడ్స్ కూడా ఉంటాయి. విశేషించి గుడ్డులో మెదడును ఆరోగ్యంగా ఉంచే 'లుటేన్' అనే ఒక ప్రత్యేక పోషకం కూడా ఉంటుంది. ఇవన్నీ గుండెను, మెదడును ఆరోగ్యంగా, గుండెపోటుకూ, పక్షవాతానికీ దూరంగా ఉంచుతాయి.ప్రతి రోజూ ఒక గుడ్డు చొప్పున తిన్నవారిలో పక్షవాతం సమస్య 12 శాతానికి తగ్గిపోయినట్లు ఇటీవలి అధ్యయనాలు కూడా స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశోధనల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ఏటా 17.7 మిలియన్ల మంది కేవలం గుండె రక్తనాళాల సమస్యల మూలంగానే ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే రోజూ ఒక గుడ్డు చొప్పున తినడం ద్వారా ఈ ప్రమాదాలను అరికట్టవచ్చంటున్నారు పరిశోధకులు. అందుకే అనుమానాలు వీడి, మొహమాటం లేకుండా రోజూ ఒక గుడ్డు తినడం అనేది ఈ రోజే మెనూలో చేర్చవచ్చంటున్నారు వైద్య పరిశోధకులు.

## సైంధవ లవణంతో..

సైంధవ లవణం (ఎప్సమ్ సాల్ట్) నిజానికి ఉప్పు కాదు. అది మెగ్నీషియం, సల్ఫేట్‌లతో తయారైన ఒక ఖనిజ లవణం. ఇంగ్లండ్‌లోని ఎప్సమ్‌లో ఉండే ఓ ఉప్పు చెలమలో మొదటిసారి కనిపించడంతో ఈ సైంధవ లవణానికి ఎప్సమ్ సాల్ట్ అనే పేరొచ్చింది. దీన్ని సాధారణంగా ఆఫ్టర్ షేవ్‌గా ఉపయోగిస్తూ ఉంటారు. అయితే దీని ఉపయోగాలు ఇంకా చాలా ఉన్నాయి. అవేంటంటే....

టబ్ నిండా గోరు వెచ్చని నీళ్లు నింపి, దాన్లో రెండు కప్పుల సైంధవ లవణం కలిపి పూర్తిగా కరగనివ్వాలి. తర్వాత ఆ నీటిలో 10 నుంచి 15 నిమిషాలు మునిగి ఉంటే ఒళ్లు, కండరాల నొప్పులు తగ్గుతాయి.

చర్మం మీద పేరుకునే మృతకణాలను వదిలించాలంటే స్నానం చేసేటప్పుడు గుప్పెడు సైంధవ లవణాన్ని చేతుల్లోకి తీసుకుని ఒళ్లంతా రుద్దుకోవాలి.

ముఖం మీద తలెత్తే బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ వదలాలంటే ఒక టీస్పూను ఎప్సమ్ సాల్ట్ చేతుల్లోకి తీసుకుని, కొద్దిగా గోరువెచ్చని నీళ్లు కలిపి, ముఖానికి సున్నితంగా రుద్దుకోవాలి. ఇలా చేస్తే మృత కణాలు వదలడంతోపాటు బ్లాక్ అండ్ వైట్ హెడ్స్ తొలగిపోతాయి.

ఆర్గానిక్ కొబ్బరినూనెకు సైంధవ లవణాన్ని కలిపి దీంతో పెదవులు రుద్దుకుంటే పగిలిన పెదవులు కోమలంగా మారతాయి.

ఒక గ్లాసు నీళ్లలో రెండు టీస్పూన్ల సైంధవ లవణాన్ని కలిపి తాగితే మలబద్ధకం సమస్య తగ్గుతుంది.

## జో కొట్టే... జాజికాయ

నిద్రలేమితో బాధపడుతూ తోచిన చిట్కాలన్నీ పాటించి విసిగిపోయారా? అయితే వంటింట్లో ఉన్న జాజికాయతో ఈ స్లీప్ డ్రింక్ తయారుచేసుకుని తాగి చూడండి!

జాజికాయ గుణాలు

దీని రసాయనిక రూపం నిద్ర మాత్రలను పోలి ఉంటుంది.

కండరాలకు సాంత్వన అందించే న్యూరో ట్రాన్స్‌మీటర్లను విడుదలయ్యేలా చేస్తుంది.

మెదడును నెమ్మదింపజేస్తుంది.

ఒత్తిడితో విడుదలయ్యే హార్మోన్ల స్రావాన్ని నియంత్రిస్తుంది.

నిద్రకు తోడ్పడే మెగ్నీషియం జాజికాయలో ఉంటుంది.

కాబట్టి జాజికాయ పొడి చేసుకుని గ్లాసు పాలల్లో అర టీస్పూను పొడి, ఒక టీ స్పూను తేనె కలుపుకుని నిద్రకు గంట ముందు తాగండి.



# రుమాటాయిడ్ ఆర్థరైటిస్‌కు సమూల వైద్యం



'రుమాటాయిడ్ ఆర్థరైటిస్' అనేది ఒక ఆటో ఇమ్యూన్ వ్యాధి. అనగా మన శరీర రోగనిరోధక వ్యవస్థ పొరబడి, మన సొంత కణజాలంపై దాడిచేయడం వలన కలిగే వ్యాధులను ఆటోఇమ్యూన్ వ్యాధులు అని అంటారు. ఈ వ్యాధినే వాడుక భాషలో 'వాతదోషం' అని అంటారు. ఏ వయస్సు వారినైనా ప్రభావితం చేసే ఈ వ్యాధి ఎక్కువగా 40 సం.. వయస్సు పైబడిన వారిలో తలెత్తుతుంది. పురుషుల కంటే స్త్రీలలో 3 రెట్లు అధికంగా, ముఖ్యంగా రుతుచక్రం ఆగిపోయిన మహిళల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. 16 సం.. వయస్సు లోపువారిలో ఈ వ్యాధి తలెత్తినచో, దీనిని వైద్య పరిభాషలో 'జువైనల్ ఆర్థరైటిస్' అని అంటారు.ఈ వ్యాధి కేవలం కీళ్లనే కాకుండా, ఇతర ముఖ్య అవయవాలైన ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, హృదయం, రక్తనాళాలు, చర్మం మరియు శరీరంలోని వివిధ రకాల కణజాలాలను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధి ముఖ్యంగా కీళ్ళలోని సైనోవియం పొరను శోథమునకు గురిచేసి, తద్వారా క్రమంగా కీళ్లలోని ఎముకలను, వాటి తాలుకు కార్టిలేజ్‌ని కూడా దెబ్బతీస్తుంది. ఫలితంగా కీళ్లు వాటి ఆకారం, అమరికను కోల్పోయి విపరీతమైన నొప్పి కలగటంతో పాటు కీళ్ల కదలికలు కష్టతరం అవుతాయి. దీర్ఘకాలికంగా ఈ వ్యాధికి గురి అయినట్లయితే వ్యాధి తీవ్రత మరింత పెరిగి, కీళ్ల అమరికలో మార్పులు ఏర్పడి, కీళ్ల వైకల్యానికి దారి తీస్తుంది. కాబట్టి మొదట్లోనే దీనిని గుర్తించి, సరైన చికిత్స అందిచటం ద్వారా ఈ వ్యాధిని అంకురం నుంచే సమూలంగా తొలగించే అవకాశం ఉంటుంది.

కారణాలు

ఈ వ్యాధి తలెత్తటానికి గల కచ్చితమైన కారణాల పరంగా ఇంతవరకు స్పష్టత లేదు. కానీ జన్యుపరమైన అంశాలు మాత్రం 50 శాతం వరకు ఈ వ్యాధికి కారణాలుగా ఉండవచ్చు.

జన్యుపరమైన సిద్ధత కలిగి ఉన్న కారణంగా కొన్ని వాతావరణ అంశాలతో పాటు, బ్యాక్టీరియా, వైరస్ ఇన్‌ఫెక్షన్‌లు ఈ వ్యాధిని ప్రేరేపిస్తాయి.

కుటుంబ చరిత్ర , పొగ తాగడం, అధిక బరువును కలిగి ఉండటం వంటి అంశాల వలన కూడా ఈవ్యాధి ప్రేరేపించబడే అవకాశం ఉంది.

రుమటాయిడ్ ఆర్థరైటిస్ బాధపడే వారిలో 80 శాతం వరకు రుమాటాయిడ్ ఫ్యాక్టర్ అనే యాంటీబాడీని కలిగియున్నారు.

లక్షణాలు

ఈ వ్యాధికి గురైన కీళ్లలో - వాపు, నొప్పి , చేతితో తాకితే వేడిగా అనిపించడం, ఉదయాన్నే నిద్రలేవగానే కీళ్లు బిగుసుకుపోవడం

శరీరంలోని ఇరు పార్శ్వాల్లో ఉండే ఒకే రకమైన కీళ్లు ప్రభావితం కావడం ఈ వ్యాధి లక్షణం.

ఈ వ్యాధి మొదట చిన్న కీళ్లు అయిన చేతి వేళ్లు, కాలి వేళ్లు, వ్యాధి తీవ్రత పెరిగే కొద్ది మణికట్టు, మోచేతులు, భుజాలు, మోకాళ్లు, తుంటి, చీలమండలం వంటి కీళ్లను ప్రభావితం చేస్తుంది.

కీళ్లు ప్రాంతపు చర్మం కింద ఫైబ్రస్ కణజాలం పెరగడంతో అవి బయటకు చిన్న కణితుల్లా కనిపిస్తాయి. వీటినే రుమాటాయిడ్ నాడ్యుల్స్ అని అంటారు.

వీటితో పాటు నీరసం, రక్తహీనత, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, జ్వరం వంటి లక్షణాలు కూడా గమనించవచ్చు.

ఈ వ్యాధి ప్రభావం- ఇతర ప్రధాన అవయవాలైన కళ్లు, చర్మం, రక్తనాళాలు, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాల పైన ఉండటం వలన కళ్లు , నోరు పొడిబారడం, ఛాతిలో నొప్పి, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడం, రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడం వలన గుండెనొప్పి వంటి లక్షణాలు గమనించవచ్చు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

సి.బి.పి, ఇ.ఎస.ఆర్, ఆర్.ఏ. ఫ్యాక్టర్, ఏఎన్‌ఏ, యాంటీ సిసిపీ, ఎక్స్-రే, ఎమ్ఆర్ఐ మొదలైన పరీక్షలు చేయడం ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చు.

హోమియోకేర్ ఇంటర్నేషనల్ చికిత్స

చాలా రకాల ఆటోఇమ్యూన్ వ్యాధులు 'సైకోసోమాటిక్ డిజార్డర్స్' కిందకు వస్తాయి. అన్ని రకాల సైకోసోమాటిక్ డిజార్డర్స్‌కు హోమియోలో చక్కని పరిష్కారం ఉంది. ఆటో ఇమ్యూన్ వ్యాధులకు ఇతర చికిత్సా విధానాల్లో శాశ్వత నివారణ లేదు. కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే లభిస్తుంది. కానీ హోమియోకేర్ ఇంటర్నేషనల్‌లో అందించే కాన్స్‌టిట్యూషనల్ వైద్య చికిత్సా విధానంలో భాగంగా, రోగి మానసిక, శారీరక లక్షణాలను పరిగణనలోకి తీసుకుని చికిత్స అందిచడం ద్వారా ఈ వ్యాధి సంపూర్ణంగా నయం అయ్యే అవకాశం ఉంది. అంతేకాకుండా ఇతర కాంప్లికేషన్స్ బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు.

# ఎముకల దృఢత్వానికి

ఎముకల దృఢత్వానికి కాల్షియం చాలా అవసరం. అంతేకాదు... కండరాలు, నరాల వ్యవస్థ సరిగ్గా పనిచేయాలంటే కాల్షియం అవసరం చాలా ఉంటుంది. డైట్‌లో ఇవి ఉండేలా చూసుకోవడం ద్వారా కాల్షియం తగినంత లభించేలా చూసుకోవచ్చు.

పాలు 1 కప్పు: కాల్షియం అనగానే ముందుగా పాలే గుర్తుకొస్తాయి. సులభంగా జీర్ణమమడమే కాకుండా శరీరం త్వరగా గ్రహిస్తుంది. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ కప్పు పాలు తీసుకుంటే 280మి.గ్రా కాల్షియం లభిస్తుంది.

ఆరెంజ్ ఒకటి: ఒక ఆరెంజ్ తీసుకుంటే 60 మి.గ్రా కాల్షియం లభిస్తుంది. అంతేకాకుండా రోగనిరోధకశక్తిని పెంచుతుంది. విటమిన్ డి కూడా ఉండటం వల్ల కాల్షియంను శరీరం త్వరగా గ్రహిస్తుంది.

సోయా మిల్క్ ఒక కప్పు: ఒక కప్పు సోయామిల్క్‌లో 60 మి.గ్రా కాల్షియం లభిస్తుంది. కాల్షియంతో పాటు విటమిన్ డి కూడా లభిస్తుంది.

బాదం: ఒక కప్పు బాదంలో 457 మి.గ్రాల కాల్షియం ఉంటుంది. కాల్షియం ఎక్కువగా లభించే ఆహారపదార్థాల్లో ఇది టాప్‌లిస్ట్‌లో ఉంటుంది బాదం. ప్రొటీన్స్ కూడా తగినంత లభిస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచే గుణం ఉంటుంది. గుండె జబ్బుల రిస్క్ తగ్గిపోతుంది.

పెరుగు: రోజులో కనీసం ఒకసారి పెరుగు వేసుకున్నా 400మి.గ్రాల



కాల్షియం లభిస్తుంది. పాలకు బదులుగా పెరుగు తీసుకున్నా తగినంత కాల్షియం లభిస్తుంది.

జున్ను: కాల్షియంతో పాటు ప్రొటీన్లు కూడా లభిస్తాయి. ఒక కప్పు జున్ను తీసుకుంటే 951మి.గ్రా కాల్షియం లభిస్తుంది.

ఆకుకూరలు: ఆకుకూరల్లోనూ కాల్షియం అధికంగా ఉంటుంది. పాలకూర, తోటకూర, బ్రొక్కోలి... వంటి ఆకుకూరల్లో కాల్షియంతో పాటు పొటాషియం, మెగ్నీషియం లభిస్తుంది. ఒక కప్పు ఆకుకూరలో 336మి.గ్రాల కాల్షియం లభిస్తుంది.

# ఎముకల దృఢత్వానికి ఏం చేయాలి?



కప్పుడు తూనీగల్లా ఎగిరిన వాళ్లే కానీ, ఇప్పుడేమో వారలో కొందరు తూగుతూ, జోగుతూ అడుగు తీసి అడుగు వేయడానికే నానా అవస్థలు పడటం కనిపిస్తుంది.

ఏదో పర్వతాన్ని భుజానెత్తుకుని మోస్తున్నట్లు ఆ అడుగులు అలా తడబడటం ఏమిటి?

పందిరి గుంజలు బలంగా లేకపోతే పందిరి అంతా అటూ ఇటూ ఊగడం మనకు తెలియనిదా! ఇదీ అంతే...!

ఎంతసేపూ భవనాల ఆకృతీ, అందాల గురించి మాట్లాడటమే గానీ, ఆ భవంతి అలా నిలబడటానికి కారణమైన దాని పిల్లర్లు, బీమ్‌ల గురించిన ప్రస్తావనే మన ముందుకు రాదు. మానవ సౌందర్య, సౌష్టవాల విసయంలో కూడా పిల్లర్లు బీమ్‌ల వంటి ఎముకల గురించి ఏమీ మాట్లాడుకోం. ఎముకలు బలంగా ఉంటేనే కదా! ఏ మనిషైనా నిండుగా, బలంగా అడుగులు వేస్తాడు. ఇంతకీ ఈ ఎముకల కథా కమామిషు ఏమిటట.

ఎముకలు అనగానే చాలా మందికి వెంటనే గుర్తొచ్చేది క్యాల్షియం ఒక్కటే. అయితే, అంతకు మించిన మరెన్నో మూలక ద్రవ్యాలు ఎముకల్లో ఉంటాయి. నిజానికి, ఎముకలు కేవలం క్యాల్షియంతో నిర్మితమైన సుద్ద పెంకులేమీ కాదు. ఎముకల తయారీలో క్యాల్షియంతో పాటు భాస్వరం, దానికి తోడు ప్రొటీన్ల వంటి మాంస ధాతువు (కొలాజెన్)లు కూడా ఉంటాయి. వీటిల్లో భాగంగానే నాడీ మండలం, రక్తప్రసార వ్యవస్థ కూడా ఉంటాయి. ఈ క్రమంలో రక్త ఉత్పత్తికి మూలమయ్యే, మూలుగ (మజ్జ) అనే మరో కణజాల వ్యవస్థకు కూడా ఎముకలు ఆశ్రయాన్నిస్తాయి.

ఎముకల క్రియాశీలత గురించి.....

ఎముకల కణ వ్యవస్థ ఒకే ఒక్కటిగా, విడిగా ఏమీ ఉండదు. అందులో భాగమై సప్తధాతువులూ ఉంటాయి. ఈ ధాతువుల్లో ఒకటైన శుక్రధాతువు నుంచే మూలకణ వ్యవస్థ (స్టెమ్‌సెల్) ప్రారంభమవుతుంది అంటే ఎముకల భూమిక ఎంత విశిష్టమో గ్రహించవచ్చు. అయితే, శరీర కదలికలకు సారథ్యం వహించే మాంస కండరాలు ఎముకల్ని ఆశ్రయించి ఉంటే, కండరాల్ని ఆశ్రయించి కొవ్వు, రక్త ధాతువులు ఉంటాయి. అందుకే ఎముకలు సారవంతంగా దృఢంగా ఉండడం శరీరానికి ఎంతో అవసరమయ్యింది. ఎముకల్లో మౌలికంగా ' ఆస్టియో బ్లాస్టులు' 'ఆస్టియో సైటులు' అనే కణాలుంటాయి. ఇవి చనిపోతే, వాటిని తొలగించడానికి 'ఆస్టియో క్లాస్టులు' అనే మరో కణజాలం కూడా పనిచేస్తూ ఉంటుంది. అంటే ఆస్టియో బ్లాస్టలనే కణాలు, క్యాల్షియం, పాస్ఫేట్లు, ప్రొటీన్లను ఉపయోగించుకుంటూ ఎముకల దారుఢ్యాన్ని కాపాడుతుంటాయి. అయితే ఎముకల్లో పెళుసుదనం ఏర్పడకుండా 'కొలాజెన్' రూపంలో ఉండే ప్రొటీన్లు కూడా ఒక నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాయి. ఈ కొలాజెన్ల వల్లే ఎగిరినప్పుడు దుమికినప్పుడు బరువులెత్తినప్పుడు ఎముకలు విరిగిపోకుండా ఉంటాయి.

క్యాల్షియం ఎముకల కోసమేనా?

శరీరంలోని 99 శాతం క్యాల్షియం ఎముకల్లోనే ఉన్నా, ఇతరమైన మరెన్నో జీవక్రియలకు కూడా క్యాల్షియం అవసరమవుతుంది. వాటిల్లో రక్తం తయారీ, రక్తం గడ్డకట్టడం వంటి ప్రక్రియలతో పాటు కండరాల, వివిధ అవయవాల కదలికలన్నింటికీ క్యాల్షియం అవసరమవుతుంది. అత్యవసరంగా శరీరంలో ఏ భాగానికి క్యాల్షియం కావలసి వచ్చినా, ఈ ఎముకలే ఆ అవసరాలు తీర్చే సరఫరా కేంద్రాలుగా కూడా పనిచేస్తాయి. ఇంతటి వైవిధ్యం గల ఈ క్యాల్షియం ఒంటికి ఇమడాలంటే, కొవ్వులతో (కొలెస్ట్రాల్) తయారయ్యే 'క్యాల్సిట్రియోల్' (ప్రీ- విటమిన్-డి), కోలికాల్సిఫెరాల్ ( విటమిన్ - డి), అవసరమవుతుంది. ఈ క్యాల్సిట్రియోల్ చర్మం, మూత్ర పిండాల సాయంతో సూర్యకిరణాల ద్వారా ఒంట్లోకి చేరుతుంది. ఆహార రూపంలో మాత్రం జంతువుల, చేపల లివర్‌లో ఎక్కువగా ఉంటుంది. ఇవి కాక, పాలు, పాల ద్వారా వచ్చే వెన్న, నెయ్యి లల్లో కొంత వరకు ఉంటుంది. అందుకే క్యాల్షియం ఎముకల్లోకి చేరాలంటే, మాంసాహారులు లివర్‌ను, శాకాహారులు పాల ఉత్పత్తులను ఆహారంలో చేర్చుకోవడం అవసరం. క్యాల్షియం స్థిరపడాలంటే, కొలాజెన్ రూపంలోని ప్రొటీన్లు కూడా అంతే అవసరం. అలాగే కేవలం అణువుల రూపంలోనే కాక క్యాల్షియం పాస్ఫేట్ అనే లవణ రూపంలో భాస్వరంతో కలిస్తేనే క్యాల్షియం, సాధ్యమవుతుంది. కాబట్టి క్యాల్షియంతో పాటు భాస్వరం (పాస్ఫరస్) కూడా అవసరమే. అందువల్ల ఎముకలు దృఢంగా ఉండాలంటే మన ఆహారంలో ప్రతిరోజూ ప్రొటీన్లు, కొవ్వులు, క్యాల్షియం, పాస్ఫరస్ అనే పోషకాలు ఉండే ఆహార పదార్థాలను ఎంచుకోవాలి. అయితే మంచి పోషకాహారం తీసుకోగానే సరిపోదు. వాటిని అరిగించుకునే జీర్ణశక్తి ఉండాలి. జీర్ణమైన వాటిని ఒంటికి ఇమిడ్చే (శోషణ శక్తి) గ్రహణ వ్యవస్థ పేగుల్లో ఉండాలి. ఒకవేళ ఈ వ్యవస్థ సరిగా లేకపోతే అందుకు తగిన ఆయుర్వేద చికిత్సలు తీసుకోవాలి.

ఏం తినాలి?

రాగులు, ఉలవలు, రాజమాలు, సోయాబీన్స్, శనగలు, మినుములు, పెసలు, బఠాణీలు, సజ్జలు

ఆకు, కూరగాయలు.......

గోబి పువ్వు ఆకులు, చేమ ఆకులు, మెంతి ఆకులు, కొత్తిమీర, పాలకూర, ఉల్లి ఆకు, క్యాబేజి, ముల్లంగి, మునక్కాయలు.

మాంసాహారంలో.....

పీతలు, బాతు, రవ్వ చేప కొర్రమీను, రొయ్యలు, పొంప్లెట్

పాల ఉత్పత్తులు

పాలు, జున్ను, కోవా, పెరుగు, కోడిగుడ్లు.ఆయుర్వేద ఔషధాల్లో 'క్యాల్షియం కార్బనేట్' కోసం, కొన్ని జంతువుల, పక్షుల, సముద్రజీవుల కవచాలను (షెల్స్) 'భస్మం' గా తయారు చేసి ఉపయోగిస్తారు.

కోడిగుడ్డు పెంకులు, గవ్వలు, నత్తగుల్లలు, పశువుల గిట్టలు, కొమ్ములు, ఏనుగు దంతాలు, జింక, దుప్పి కొమ్ములను కూడా ఇందులో ఉపయోగిస్తారు. ఇవే కాకుండా గుగ్గులు, తిక్తక ఘృతం వంటి నెయ్యితో తయారు చేసే మందులు, గంధ తైలం వంటి కొన్ని రకాల తైలాలు కూడా ఇస్తారు. మూలి కల్లో అయితే నల్లేరు తీగలు ప్రశస్తమైనవి. పైకి కనిపించే చర్మం, దాని సౌందర్యం, దాని ఆరోగ్యం విషయాల్లో మనమెంతో శ్రద్ధ వహిస్తాం. కానీ, అంతకన్నా 100 రెట్ల అధిక శ్రద్ధ ఈ ఎముకల పట్ల చూపాల్సి ఉంటుంది.

# సినిమాస్కోప్

## సాయితేజ్ జోక్ చేశాడు.. నా పెళ్లి ఇప్పట్లో ఉండదు: అల్లు శిరీష్



వయసులో తన కంటే అల్లు శిరీష్ పెద్దవాడని, త్వరలోనే అతని పెళ్లి జరగబోతోందని మెగా హీరో సాయితేజ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీంతో శిరీష్ పెళ్లి గురించి పెద్ద ఎత్తున ప్రచారం మొదలైంది. పలువురు నెటిజన్లు సోషల్ మీడియా ద్వారా శిరీష్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ ప్రచారంపై శిరీష్ తాజాగా స్పందించాడు. తన పెళ్లి ఇప్పట్లో ఉండదని స్పష్టం చేశాడు. %--%హహహ.. తేజూ సరదాగా జోక్ చేసి ఉంటాడు. మీరు సీరియస్‌గా తీసుకున్నారు. పెళ్లి విషయంలో మా పేరెంట్స్ నుంచి ఎలాంటి ఒత్తిడీ లేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు అన్ని విషయాలూ నేను చెబుతాన%--%ని శిరీష్ ట్వీట్ చేశాడు.

## ధనుశ్ హాలీవుడ్ ప్రాజెక్ట్..!



తెలుగు, తమిళ ప్రేక్షకులకే కాదు.. బాలీవుడ్ ప్రేక్షకులకు కూడా సుపరిచితుడైన అతి కొద్ది మంది హీరోల్లో ధనుశ్ ఒకరు. మన ఇండియన్ సినిమాల్లోనే కాకుండా కొన్ని నెలల క్రితం 'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్' అనే హాలీవుడ్ సినిమాలో ధనుశ్ నటించిన సంగతి తెలిసిందే. వైవిధ్యమైన పాత్రలు, సినిమాలు చేసే ఈ స్టార్ త్వరలోనే మరోసారి హాలీవుడ్ ప్రేక్షకులను పలకరించనున్నారట. 'ది గ్రే మ్యాన్' అనే హాలీవుడ్ మూవీలో ధనుశ్ ఓ కీలక పాత్రను పోషించనున్నారు. ఈ సినిమాలో ధనుశ్ సరసన జెస్సీకా హెన్‌విక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇంకా ఈ సినిమాలో రియాన్ గోలింగ్, క్రిస్ ఎవాన్స్, అనాదే అర్మాస్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. అవెంజర్స్, కెప్టెన్ అమెరికా, వింటర్ సోల్జర్ చిత్రాలను తెరకెక్కించిన దర్శకులు రూసో బ్రదర్స్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ప్రముఖ డిజిటల్ సంస్థ నెట్‌ఫ్లిక్ నిర్మిస్తున్న చిత్రం డైరెక్ట్ డిజిటల్ రిలీజ్ కానుంది.

## నిధి అగర్వాల్ మకాం మార్చేసిందా ఏమిటి?!



కొంతకాలం క్రితం తెలుగు తెరకి పరిచయమైన నాజూకు భామల లిస్టులో 'నిధి అగర్వాల్' కూడా కనిపిస్తుంది. చక్కని కనుముక్కుతీరుతో ఈ సుందరి యూత్ హృదయాలను కాజేసింది. హిందీ సినిమాతో కెరియర్ ను మొదలెట్టిన ఈ అమ్మాయి తెలుగు తెరపై వాలడానికి ఎక్కువ టైమ్ తీసుకోలేదు. ముందుగా నాగచైతన్య సినిమా 'సవ్యసాచి'లో అవకాశాన్ని పట్టేసిన ఈ బ్యూటీ ఆ తరువాత అఖిల్ జోడీగా 'మిస్టర్ మజ్ను'లో ఆడిపాడింది. అయితే అక్కినేని ఫ్యామిలీ హీరోలతో చేసిన రెండు సినిమాలు ఈ కందిరీగకు కలిసిరాలేదు. సన్నజాజి తొడిమలాంటి ఈ అమ్మాయి తన గ్లామర్ కి సక్సెస్ కలిసిరాకపోవడంతో డీలాపడిపోయింది. అలాంటి పరిస్థితుల్లోనే పూరి జగన్నాథ్ నుంచి పిలుపు వచ్చింది. ఆయన దర్శకత్వంలో రామ్ హీరోగా రూపొందిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమా చేసింది. ఈ సినిమాలో నిధి అగర్వాల్ ని పూరి .. 'అందాల నిధి'గానే చూపించాడు. అమ్మడి గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాక్సాఫీస్ దగ్గర ఈ సినిమా భారీ వసూళ్లను సాధించడంతో ఈ రాజకుమారి బిజీ అవుతుందని అంతా అనుకున్నారు. కానీ అలాంటి సంఘటనలేవీ జరగలేదు. కొత్త హీరోతో ఒక సినిమా కమిట్ అయినట్టుగా వార్తలు వచ్చాయి .. ఆ తరువాత దాని గురించిన ఊసులేదు. కొత్తగా చాలా సినిమాలు పూజలు చేయించుకుని .. క్లాప్ లు కొట్టుకుంటున్నాయి. అయినా ఏ హీరో సరసన నిధి అగర్వాల్ పేరు వినిపించడం లేదు. ప్రస్తుతం నిధి అగర్వాల్ తమిళంలో రెండు సినిమాలు చేస్తోంది. 'భూమి' .. 'ఈశ్వరన్' పేర్లతో ఈ సినిమాలు రూపొందుతున్నాయి. వచ్చే ఏడాది ఆరంభంలో ఈ సినిమాలు థియేటర్స్ కు రానున్నాయి. సాధారణంగా ఒక భాషలో అవకాశాలు లేనివారు మరో భాషా చిత్రాలపై దృష్టిపెడుతుంటారు. అలాంటిది తెలుగులో ఒక సూపర్ హిట్ దక్కిన తరువాత నిధి అగర్వాల్ కోలీవుడ్ పై శ్రద్ధ పెట్టడం ఆశ్చర్యం. కోలీవుడ్ పై కొత్త మోజుతో నిధి అగర్వాల్ అక్కడికి మకాం మార్చేసిందా? అక్కడి సినిమాలు పూర్తికాగానే ఇటో అడుగు వేస్తుందా? అనేది చూడాలి.

## ఘాటు ఫోజులతో చెలరేగుతున్న ప్రగ్య.. కారణమిదే!



దీపం ఉండగానే చక్కదిద్దుకోవాలి. క్రేజు ఉండగానే నాలుగు కాసులు ఆర్జించాలి. ప్రస్తుతం తనకు సోషల్ మీడియాల్లో పెరుగుతున్న ఫాలోయింగ్ ను దృష్టిలో పెట్టుకుని ప్రగ్య ఘాటైన ఫోజులతో చెలరేగుతోంది. తద్వారా ఫాలోవర్స్ సంఖ్య అమాంతం పెరుగుతోంది. ఇది తన టార్గెట్ -ఎక్స్ కి ఎంతో హెల్ప్ అవుతోంది మరి. ఇటీవల వరుసగా ప్రఖ్యాత బ్రాండ్లను తన ఖాతాలో వేసుకుంటూ ప్రగ్య బాగానే ఆర్జిస్తోంది. ఇక సినిమాల పరంగా అవకాశాలేవీ లేకపోయినా ఆదాయ ఆర్జనలో ఫర్వాలేదనిపించేస్తోందట. ఇంతకుముందు పలు కార్పొరెట్ బ్రాండ్లకు ప్రచారం చేస్తున్న ఫోటోల్ని షేర్ చేసిన ప్రగ్య మరోసారి లేటెస్ట్ ఫోటోషూట్ లో చెలరేగింది. బ్లాక్ డిజైనర్ క్రిస్టలైన్ డ్రెస్ లో ప్రగ్య టూమచ్ హాట్ గా కనిపిస్తోంది. ఆల్మోస్ట్ అర్ధ నగ్నంగా అందాలను ఎలివేట్ చేస్తున్న ఆ డిజైన్ సంథింగ్ హాట్ అనే చెప్పాలి. అన్నట్టు ప్రగ్యకు పవన్ సరసన హరీష్ శంకర్ సినిమాలో ఆఫర్ అంటూ ప్రచారమైంది. దానిపై సరైన అప్ డేట్ రివీల్ కావాల్సి ఉంది ఇంకా.

## నన్ను చాలా మంది ద్వేషిస్తున్నారు: కంగన

తాను ఎప్పుడూ నిజాలనే మాట్లాడతానని, అందుకే అందరూ తనను ద్వేషిస్తుంటారని బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ పేర్కొంది. ఇటీవల బాలీవుడ్ గురించి, పలు రాజకీయ, సామాజిక అంశాల గురించి కంగన సోషల్ మీడియా ద్వారా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో సోషల్ మీడియా వేదికగా కంగనపై ట్రోలింగ్ జరుగుతోంది. తనపై వ్యక్తమవుతున్న వ్యతిరేకత గురించి తాజాగా కంగన మాట్లాడింది. నేను నిజాయితీగా మాట్లాడతాను. చిత్ర పరిశ్రమలోని నిజాలను వెల్లడించాను. అందుకే ఇండస్ట్రీలోని చాలామంది నన్ను ఇష్టపడరు. నేను రిజర్వేషన్లను వ్యతిరేకించాను.. అందువల్ల హిందువుల్లో చాలా మంది నన్ను వ్యతిరేకిస్తారు. %--%మణికర్ణిక%--% సినిమా విడుదల విషయంలో కర్ణిసేనతో పోట్లాడాను.. అప్పుడు రాజ్‌పుత్‌లు నన్ను బెదిరించారు. నేను ఖలిస్తానీలను వ్యతిరేకించాను.. కాబట్టి చాలా మంది సిక్కులు నాకు వ్యతిరేకంగా మారారు. నేను ఇస్లాం వాదులను వ్యతిరేకిస్తాను.. కాబట్టి వారు నన్ను ద్వేషిస్తారు. నాలాంటి వ్యక్తిని ఏ రాజకీయ పార్టీ కూడా అక్కున చేర్చుకోదు. ఇదంతా ఎందుకు చేస్తున్నానని మీరంతా ఆశ్చర్యపడుతుండవచ్చు. ఈ ప్రపంచంలో నన్ను ఎవరూ మెచ్చుకోకున్నా.. నా మనస్సాక్షి మాత్రం నన్ను ఎప్పుడూ ప్రశంసిస్తూనే ఉంటుంద%--%ని కంగన పేర్కొంది.



## వైరల్ అవుతున్న పవన్ భార్య, పిల్లల ఫొటోలు!



పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ భార్య, పిల్లల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పవన్ కల్యాణ్ భార్య అన్నా లెజినోవా, కుమార్తె పొలెనా అంజనా పవనోవా, కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో సందడి చేశారు. ఇటీవల రష్యా వెళ్లిన వీరు తాజాగా నగరానికి తిరిగి వచ్చారు. విమానాశ్రయంలో వీరిని చూసిన పలువురు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఇవి వైరల్‌గా మారాయి. క్యూట్‌గా ఉన్న పవన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచాడు.

## "టక్ జగదీష్" నుంచి సాలిడ్ అప్డేట్..గట్టిగానే ప్లాన్ చేసినట్టున్నారే!

తనదైన సినిమాలు అలాగే తన సహజ నటనతో మంచి ఆదరణను సంపాదించుకున్నాడు నాచురల్ స్టార్ నాని. ఇప్పుడు కూడా తన కొత్త తరహా సినిమాలను పరంపరను కొనసాగిస్తూ ప్లాన్ చేసిన సినిమాల్లో ఒకటైన "టక్ జగదీశ్" కూడా ఒకటి. టాలెంటెడ్ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై మంచి అంచనాలు నెలకొన్నాయి.ఎరి అందుకు తగ్గట్టుగానే మేకర్స్ కూడా సినిమాను తీర్చిదిద్దారు. ఇక ఇదిలా ఉండగా మేకర్స్ ఈరోజు తమ చిత్రం నుంచి ఒక అప్డేట్ ఇస్తున్నామని నిన్న అలెర్ట్ చేశారు. మరి ఆ సాలిడ్ అప్డేట్ ను ఇప్పుడు రివీల్ చేశారు. రోకటిలో దంచుతున్న ఒక మాస్ పోస్టర్ ను విడుదల చేసి ఈ డిసెంబర్ 25కి ఫోకస్ షిఫ్ట్ చేశామని చెప్తున్నారు. అంటే క్రిస్మస్ గిఫ్ట్ గా "టక్ జగదీష్" నుంచి నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ ను రివీల్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేసేసారు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## "మాస్టర్"కు మన దగ్గర కూడా గట్టి రెస్పాన్సే వచ్చింది.!

ఇళయ థలపతి విజయ్ హీరోగా లోకేష్ కనగ్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా "మాస్టర్". భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. అయితే ఒక్క తమిళ్ లోనే కాకుండా తెలుగులో కూడా గ్రాండ్ రిలీజ్ కు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అంతకు ముందు వచ్చిన "విజిల్", "సర్కార్" సినిమాలతో మంచి క్రేజ్ ను కూడా విజయ్ సొంతం చేసుకున్నాడు. అలా ఇప్పుడు ఈ సినిమా తెలుగు వెర్షన్ టీజర్ ను విడుదల చెయ్యగా దానికి కూడా గట్టి రెస్పాన్స్ నే అందిస్తున్నారు. వ్యూస్ మరియు లైక్స్ పరంగా అతి తక్కువ సమయంలోనే లక్షల్లో అందిస్తున్నారు. సో తెలుగులో విజయ్ కు మరో మంచి వెల్కమ్ దక్కేలా ఉంది అనే చెప్పాలి. ఇక ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించగా మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ఒక పవర్ ఫుల్ విలన్ రోల్ లో కనిపిస్తున్నాడు. ఇక అలాగే ఈ చిత్రంలో మాళవికా మోహనన్ హీరోయిన్ గా నటించింది. ఈ చిత్రాన్ని తెలుగులో ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ వారు విడుదల చేస్తున్నారు.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989